ప్రజాశక్తి

ఆదివారం 8 అక్టోబర్ 2023 | 8 పేజీలు

గుంటూరు | పల్నాడు

పడిపోయిన పసుపు సాగు

- ధరల్లేక డీలాపడ్డ రైతులు
- క్వింటాళ్ రూ.5 వేలకు మించి కొనుగోలు చేయని వైనం
- సీజన్ ముగిసిన తరువాత రూ.12 వేలకు పెరుగుదల

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గత సీజన్‌లో ఎదురైన నష్టాలతో ఈ ఏడాది పసుపు రైతుల్లో ఉత్సాహం తగ్గింది. అమ్మబోతే అడవి... కొనబోతే కొరివి.. అన్నట్లుగా మారుతున్న పరిస్థితులతో రైతులు అసహనానికి గురవుతున్నారు. ఆరుగాలం శ్రమించిన రైతులు నష్టాలు మూటగట్టుకుంటుంటే దళారులు మాత్రం లాభాలు పొందుతున్నారు. గత సీజన్‌లో ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధర రూ.6850కు పంటను ఎక్కడా కొనుగోలు చేయలేదు. కేవలం రూ.5 వేలకే కొనుగోలు చేశారు. ప్రస్తుతం క్వింటాళ్ రూ.12 వేలకు చేరడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. తాము అమ్మే సమయంలో ధరలు గణనీయంగా తగ్గించడం, ఆతరువాత కొద్ది కాలానికే భారీగా పెంచడం పరిపాటైందని మండిపడుతున్నారు.

పసుపు సాగులో ఏటికేడు పెట్టుబడులు పెరగడం, ధరలు మాత్రం తగ్గడంతో రైతులు సాగుకు విముఖత చూపుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 16,500 ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా ఈ ఏడాది ఇప్పటివరకు 7,200 ఎకరాల్లోనే సాగైంది. ప్రస్తుత గుంటూరు జిల్లాలో 5500 ఎకరాల్లో సాగవుతుందని భావించగా 3,800 వేల ఎకరాల్లోనే వేశారు. అయితే అనూహ్యంగా ఖరీఫ్ సాగు ముగింపు సమయంలో పసుపు ధరలు గణనీయంగా పెరిగాయి. బాపట్ల జిల్లాలో 4 వేల ఎకరాలకు గాను కేవలం 400 ఎకరాల్లోనే, పల్నాడు జిల్లాలో 7 వేల ఎకరాలకు గాను మూడు వేల ఎకరాల్లోనే పసుపు సాగైంది.

గత మే మొదటి వారంలో భారీ వర్షాలకు కళ్లాల్లో, రహదారులపై ఆరబోసిన పసుపు పంటకు భారీ నష్టం వాటిల్లింది. జులైలో పసుపు కొనుగోలుకు చర్యలు తీసుకున్నా నాణ్యత పేరుతో ధరను అమాంతం తగ్గించారు. పసుపు రైతులు ఎకరాకు రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షల వరకు పెట్టుబడి పెట్టగా 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటాళ్ రూ.5 వేలకు మించి కొనుగోలు చేయకపోవడం వల్ల ఈ ఏడాది ప్రతి రైతు రూ.లక్షన్నర వరకు నష్టపోయాడు. 80 శాతం మంది రైతులు తక్కువ ధరలకే అమ్ముకున్నారు. రైతులవద్ద 90 శాతం సరుకు విక్రయాలు పూర్తయిన తరవాత ధరలు గణనీయంగా పెరిగాయి. గత మూడేళ్లుగా సరైన ధరల్లేక రైతులు పసుపు సాగుకు దూరం అయ్యారు. దుగ్గిరాలలో పసుపు యార్డు ఉన్నా రైతులకు ఆశించిన ప్రయోజనాలు దక్కడం లేదు. కేంద్ర ప్రభుత్వానికి ప్రతియేటా రూ.వేలకోట్ల విదేశీమారక ద్రవ్యం తెచ్చిపెడుతున్న పసుపు కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం తగిన శ్రద్ధచూపడం లేదు. పసుపు మద్దతు ధర రూ.10 వేలు ఇవ్వాలనే డిమాండ్‌ను పట్టించుకోవడం లేదు. పసుపు బోర్డు ఏర్పాటు ఎన్నికల హామీగానే మిగిలింది. ఇటీవల తెలంగాణలో పర్యటించిన ప్రధాని మోడీ నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినా ఆచరణలో ఎప్పటికి సాధ్యమోనని రైతులు పెదవి విరుస్తున్నారు.

ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు.. శుక్రవారం రాత్రి ఆందోళన కొనసాగిస్తున్న ఆశాలు (ఇన్‌సెట్)

ముందు నిర్బంధం.. ఆపై అంగీకారం..

- అధికారులతో నాయకుల చర్చలు సఫలం
- ఆశా కార్యకర్త కృపమ్మ కుటుంబానికి పరిహారానికి ఒప్పందం
- తొలుత ఉద్యమంపై పోలీసుల తీవ్ర నిర్బంధం - నాయకులు, ఆశాల అరెస్టు

ప్రజాశక్తి-తాడేపల్లి

పని ఒత్తిడి, అధికారుల వేధింపుల కారణంగా మృతి చెందిన ఆశా కార్యకర్త కృపమ్మ కుటుంబానికి న్యాయం కోసం చేపట్టిన పోరాటం ఫలించింది. యూనియన్ నాయకులతో శనివారం చర్చించిన అధికారులు పలు డిమాండ్లను అంగీకరించడంతో ఆందోళనను విరమిస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. అయితే అంతకుముందు స్థానిక ప్రకాష్‌నగర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలో ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశాలు ఆందోళన చేపట్టగా సిఐ శేషగిరిరావు తన సిబ్బందితో వచ్చి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీతో పాటు పలువుర్ని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు బలవంతంగా తరలించారు. కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు పోలీస్‌స్టేషన్ ముందే రోడ్డుపై బైటాయించారు. సిఐటియు నాయకులతో పాటు ఆశ కార్యకర్తలు, టిడిపి పట్టణ అధ్యక్షులు వి.వెంకట్రావు ఆందోళనలో పాల్గొన్నారు.

చర్చల అనంతరం ఎమ్మెల్సీ అధికారులు, నాయకులు

2లో

ప్రైవేటు ల్యాబ్‌ల దందాను సహించం

జిజిహెచ్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో ప్రైవేట్ ల్యాబ్‌లకు చెందినవారు దందా చేస్తే సహించబోమని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఇద్దరు యువకులు రక్తపరీక్షల నమూనాలను తీసుకుని వెళ్తుండగా ఆయన గుర్తించి నిలదీశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన మీడియాకు తెలిపారు. ప్రైవేట్ ల్యాబ్‌కు చెందిన కొంతమంది ఉదయం పూట వార్డుల్లో తిరుగుతుంటే ఒకసారి హెచ్చరించి వదిలేశానని, అయినా వారిలో మార్పు రాకపోగా రాత్రిళ్లు తిరగడం మొదలు పెట్టారని అన్నారు. ఆసుపత్రి తనిఖీ చేస్తున్న సమయంలో ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతుంటే వారిని ప్రశ్నించడంతో

2లో

అంత్యక్రియలనూ అడ్డుకుంటున్నారు

- శ్మశాన స్థలాల్లేక దళితుల అవస్థలు
- సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లకు ఎసరు
- పనులు పూర్తయినా పొలాలకు అందని నీరు
- సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో ప్రజల ఆవేదన
- 5వ రోజు సాగిన పాదయాత్రకు పలు గ్రామాల్లో ఘన స్వాగతం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

దళితులెవరైనా చనిపోతే ఖననం చేసేందుకు శ్మశాన స్థలాలూ లేవని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఆందోళన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో కాల్వ కట్టల వెంట ఖననం చేయాల్సిన దుస్థితి నెలకొందని, ఆ సందర్భంలోనూ అధికారులు అడ్డుకుంటున్నారని విమర్శించారు. మంగళగిరి నియోజకవర్గంలో సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్ర ఐదో రోజైన శనివారం తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పాదయాత్రకు ప్రజలు ఘన

2లో

తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న పాదయాత్ర బృందం

విద్యుత్ శాఖ భారీగా అపరాధ రుసుం

ప్రజాశక్తి గుంటూరు సిటి

విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల ఆధ్వర్యములో పల్నాడు జిల్లాలోని కారంపూడి, చింతపల్లి, ఒప్పిచెర్ల, రెడ్డిపాలెం, చిన్న గార్లపాడు, చింతపల్లి, పేటసనిగండ్ల, పెదకొందమగండ్ల, గ్రామాల్లో విస్తృత తనిఖీలు చేపట్టామని ఇఇ కె.సూర్యప్రకాష్ శనివారం ఒ ప్రకటన ద్వారా తెలిపారు. తనతోపాటు డిపిఇ, ఆపరేషన్ ఇఇ హరిబాబు ఆధ్వర్యంలో 47 మంది అధికారులు, 141 మంది సిబ్బంది 47 బృందాలుగా ఏర్పడి 4450 సర్వీసులను పరిశీలించామని, విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 108 మందికి రూ.3.99 లక్షలు అపరాధ రుసుం విధించామని తెలిపారు. మీటరు లేకుండా డైరెక్టుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 23 మందికి రూ.41 లక్షలు, మీటర్ ఉన్నా అక్రమముగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న నలుగురికి 23 లక్షలు, విద్యుత్ శాఖ అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఐదుగురికి

2లో

పొలాల్లో ట్రైనీ కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగుకు అనుకూలంగా వుండే ఉద్యాన పంటలు సాగు చేయాలని రైతులకు పల్నాడు జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ సూచించారు. శనివారం నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం, అర్వపల్లి గ్రామాల్లో ఉద్యాన పంటలను ట్రైనీ కలెక్టర్ పరిశీలించారు. డ్రాగన్ పండ్ల తోట సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు షేక్ సాంబశివరావు మాట్లాడుతూ డ్రాగన్ పండ్ల తోట సాగు లాభదాయకంగా ఉందని, ఉద్యాన శాఖ నుంచి డ్రిప్, ప్యాక్ హౌస్ రాయితీ వచ్చిందని చెప్పారు. రైతు తన్నీరు నాగేశ్వరరావు సాగు చేస్తున్న కూరగాయలు, పసుపు పంటను ట్రైనీ కలెక్టర్ పరిశీలించారు. పెట్లూరివారిపాలెం గ్రామములో రైతు తమ్మిశెట్టి ఏడుకొండలు రాళ్ల పందిరి (శాశ్వత పందిరి) దొండ పంట సాగు వివరాలు పందిరి నిర్మాణం వ్యయం, రాయితీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఉద్యాన శాఖ అధికారి జాన్ బెన్ని, ఉద్యాన శాఖ అధికారి నవీన్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీహర్ష, మల్లికార్జున, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

అపూర్వం పూర్వ విద్యార్థుల సహకారం..

ఎస్‌కెబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి రూ.15 లక్షల విరాళం

ప్రజాశక్తి - మాచర్ల

కళాశాలలో 4 దశాబ్దాల కిందట చదువుకుని వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కళాశాలకు అవసరం ఏర్పడిందనే విషయం తెలుసుకొని తోచినంత సాయం చేయటమే కాకుండా వందల మైళ్ళ నుండి ప్రత్యక్షంగా పాత మిత్రులను కలుసుకోవటానికి కాలేజీకి వచ్చారు. 30 మంది పూర్వ విద్యార్థులు కలిసి రూ.15 లక్షలను తమ కాలేజీకి ఇచ్చారు. వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి డిగ్రీ కళాశాల పరిశీలనకు నాక్ బృందం వస్తుందని పూర్వ విద్యార్థులకు సమాచారం అందింది. కళాశాలలో మౌలిక వసతుల కొరత ఉందని, వాటి కోసం అవసరమైన నిధులు లేవని తమ సహకారం అవసరమని తెలియటంతో 1977-83 బ్యాచ్ విద్యార్థులు తమ వంతు సహకారంగా రూ.15 లక్షలు అందించారు. వీటితో కుర్చీలు కంప్యూటర్స్ ఇతర అవసరాలు సమకూర్చారు. పూర్వవిద్యార్థుల్లో పోలవరం చీఫ్ ఇంజినీర్ బుర్రి సుధాకార్‌బాబు రూ.5 లక్షలు, ప్రముఖ నేత్ర వైద్యులైన డాక్టరు ఎ.రామలింగారెడ్డి రూ.లక్ష, విదేశాలలో స్థిర పడిన మరో ఇంజినీరు ఎస్.రామ్‌నాద్ రూ.లక్ష చొప్పున అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకుని చిన్ననాటి తమ అనుభవాలను ఆత్మీయంగా పంచుకున్నారు. అనంతరం నాక్ బృందాన్ని కలవగా వారు అభినందించారు.

ప్రైవేటు ల్యాబ్‌ల దందాను సహించం

(మొదటి పేజీ తరువాయి)

అసలు విషయం బయట పడిందన్నారు. యువకుల చేతిలో బ్లడ్ శాంపిల్స్ కాగితలు కనిపించాయని, దీనిపై సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు, ఒక బైకును పోలీసులకు అప్పగించామన్నారు. ఆస్పత్రిలో ద్విచక్ర వాహనాల చోరీ జరుగుతోందని, వీటి కట్టడికీ చర్యలు తీసుకుంటున్నామని సూపరింటెండెంట్ చెప్పారు.

అంత్యక్రియలనూ అడ్డుకుంటున్నారు

మంగళగిరి మండలంలో పాదయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

స్వాగతం పలికి తమ సమస్యలపై వినతిపత్రాలను పాదయాత్ర బృందానికి ఇచ్చారు. శనివారం పాదయాత్ర తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో ప్రారంభం గ్రామంలోని మసీదు సెంటర్ వద్ద భవన నిర్మాణ కార్మికులతో పాశం రామారావు మాట్లాడి వారి సమస్యలు తెసుకున్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా కుదించిందని, అనేకసార్లు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. దీనిఫలితంగా నిత్యవసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజలపై అదనపు బారాలు పడ్డాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఇసుక విధానం వల్ల ఇసుక కొరత ఏర్పడి కార్మికులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. తాడేపల్లి మండలంలోని పలు గ్రామాలు మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసి పన్నుల భారాన్ని మోపారని అన్నారు. రాష్ట్రంలోని అధికార వైపితోపాటు ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలో మోడీ జపం చేస్తున్నారేగాని వారికి ప్రజా సమస్యలు పట్టడం లేదన్నారు. ఇదిలా ఉండగా పాదయాత్ర బృందానికి వడ్డేశ్వరంలోని భూ పోరాట కేంద్రంలో అసైన్డ్ భూముల్లో నివసిస్తున్న పేదలు తామున్న చోటే ఇళ్ల స్థలాలను రెగ్యులర్ చేసి, పట్టాలివ్వాలని మహిళలు వినతి పత్రాన్ని ఇచ్చారు.

అనంతరం ఇప్పటం గ్రామానికి చేరుకున్న పాదయాత్రలో సిపిఎం జిల్లా నాయకులు కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని కార్పొరేట్ల పరం చేసేందుకు మోడీ ప్రభుత్వం పూనుకుందని మండిపడ్డారు. వ్యవసాయంలో నష్టాలతో రైతులు, కౌలురైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా వాటిని నివారించడంలో, మృతుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని ఆత్మకూరు, పెదవడ్లపూడిలో పాదయాత్ర జరిగింది. గ్రామస్తులు స్వాగతం పలికి పలు సమస్యలను పాదయాత్ర బృందం దృష్టికి తెచ్చారు. ఆత్మకూరు నిమ్మగడ్డనగర్ మొసలి పకీరయ్య అధ్యక్షతన సభ నిర్వహించగా రామారావు మాట్లాడుతూ గ్రామాల్లోని పేదలు ఎక్కడ నివాసం ఉంటుంటే అక్కడే వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణ పేరుతో గ్రామంలో తొలగించిన పేదల ఇళ్లకు ప్రత్యామ్నాయంగా నేటికీ స్థలాలు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మకూరులో నిమ్మగడ్డ రామ్మోహనరావు నగర్, వైఎస్సార్ కాలనీ, వడ్డెర కాలనీ ప్రజలు ఇళ్ల పట్టాలు లేక అవస్థలు పడుతున్నారని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని 200 దళిత కుటుంబాలకు స్మశాన స్థలం లేక అవస్థలు పడుతున్నారని, కాల్వ గట్టుల వద్ద ఖననం చేస్తుంటే ఇరిగేషన్ అధికారులు ఆడుకుంటున్నారని అన్నారు. ఆత్మకూరు రోడ్డు విస్తరణ బాధితులు 80 మందికి ఇప్పటికీ స్థలాలు కేటాయించలేదన్నారు.

అనంతరం పాదయాత్ర పెదవడ్లపూడికి చేరింది. హై లెవెల్ ఛానల్ పనులు పూర్తయినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఐదు మండలాలకు చెందిన సుమారు 25 వేల ఎకరాలకు నీరు అందడం లేదని స్థానికులు వాపోయారు. అనంతరం రామారావు మాట్లాడుతూ పేదలు నివాసం ఉన్నచోటే వాటిని క్రమబద్ధీకరించాలనే ప్రభుత్వ జీవోలున్నా అమలకు నోచుకోవడం లేదన్నారు. కాల్వ కట్టల సుందరీకిరణ పేరుతో కాల్వకట్లపై నివసించే పేదల ఇళ్లను తొలగించేందుకు పూనుకున్నారని విమర్శించారు. పిడబ్ల్యూడి కట్టలపై, చెరువు పోరంబోకు ప్రాంతాల్లో ఏళ్ల తరబడి కూలి నాలి చేసుకునే పేదలు తమ ఇళ్లను తొలగిస్తారంటూ నోటీసులు ఇవ్వడంతో వారు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. పేదల వద్ద చెత్త పన్నును బలవంతంగా వసూలు చేస్తున్నారని, చెల్లించని వారికి సంక్షేమ పథకాల్లో కోత పెడతామంటూ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా పాదయాత్రలో భాగంగా ఆయా గ్రామాల్లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్, పుచ్చలపల్లి సుందరయ్య, భగత్‌సింగ్, నిమ్మగడ్డ రామ్మోహనరావు, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు.

దుగ్గిరాల మండలంలో వినతిపత్రం ఇస్తున్న మహిళలు

ప్రజాశక్తి దుగ్గిరాల

అసెంబ్లీలో వ్యక్తిగత దూషణలు తప్ప ప్రజలకు ఉపయోగపడే అంశాలు చర్చించడం లేదని పాశం రామారావు విమర్శించారు. మండలంలోని రేవేంద్రపాడు, పెదపాఎలంలో పాదయాత్రకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా స్థానికులు వితిపత్రాలు ఇచ్చారు. కాల్వ గట్టు మీద ఉన్న ఇళ్లను తొలగించరాదని, ఎస్సీలకు శ్మశాన స్థలాలు కేటాయించాలని, కాలం చెల్లిన వంతెన స్థానంలో కొత్తవంతెన నిర్మించాలని అర్జీల్లో ప్రజలు కోరారు. ఇదిలా ఉండగా పాదయాత్రకు ముందు ప్రజానాట్య మండలి కళాకారులు డి.శ్రీనివాసరావు, పి.ప్రసాద్ తదితరులు గేయాలు ఆలపిస్తూ ఉత్సాహ పరుస్తున్నారు. పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి, ఎస్ఎస్ చెంగయ్య, ఇ.అప్పారావు, సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, తాడేపల్లి మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి, మంగళగిరి పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, నాయకులు ఎస్.బాలాజీ, వి.వెంకటేశ్వరరావు, ఎం.భాగ్యరాజు, జె.నవీన్‌ప్రకాష్, పి.కృష్ణ, బి.సంసోను, వి.పున్నయ్య, వి.దుర్గారావు, యు.దుర్గారావు, ఎం.బాగ్యరాజు, ఎం.బాలాజీ, జి.నాగేశ్వరరావు, క్రాంతి, కృష్ణకాంత్, ఎం.రాజముని, జె.బాలరాజు, వై.స్టాలిన్, ఎస్.గౌరి, వై.బ్రహ్మేశ్వరరావు, ఎం.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ముందు నిర్బంధం.. ఆపై అంగీకారం..

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు రాష్ట్ర వ్యాప్త నిరసనలకు యూనియన్ పిలుపు నేపథ్యంలో శనివారం ఉదయమే ఆశా కార్యకర్తలు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చేందుకు సిద్ధమవడంతో పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ఉదయం ఆరు గంటలప్పుడు ధనలక్ష్మిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ వ్యాన్‌లోకి ఎక్కించారు. అడ్డుపడిన ఆశ కార్యకర్తలను పక్కకు నెట్టివేశారు. ఆమెను ఎక్కడకు తీసుకెళ్తున్నారో మధ్యాహ్నం వరకూ వెల్లడించలేదు. మరో గంట తర్వాత సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, తాడేపల్లి పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు, నాయకులు బి.వెంకటేశ్వర్లు, కె.కరుణాకరరావు, కె.బాబూరావు, టిడిపి పట్టణ కార్యదర్శి వి.వెంకట్రావులతో పాటు మరో నలుగురు ఆశ కార్యర్తలను అరెస్టు చేసి దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులకు, నాయకులకు, ఆశ కార్యకర్తలకు పెనుగులాట జరిగింది. పరిస్థితి ఉధృతంగా మారుతుందనుకున్న అధికారులు జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడారు. నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన ధనలక్ష్మిని తిరిగి తాడేపల్లి తీసుకొచి జిల్లా అధికారులతో చర్చించారు. చర్చల అనంతరం ధనలక్ష్మి మాట్లాడుతూ ఇది ఆశా కార్యకర్తల పోరాట విజయమని చెప్పారు. మెడికల్, మెటర్నిటీ సెలవులతో పాటు పండుగలు, ఆదివారాలకూ సెలవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, ఐద్వా రాష్ట్ర నాయకులు డి.శ్రీనివాసకుమారి, సిపిఎం నాయకులు డి..వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలతో గొడ్డు చాకిరి చేయిస్తున్నారని మండిపడ్డారు. పైగా రూ.10 వేల వేతనాలతో కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. ఈ సమస్యలపై ఆశాలు స్ఫూర్తి, ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

అధికారుల ఒత్తిడి వల్లనే ఆశ వర్కర్ రేపూడి కృపమ్మ విధి నిర్వహణలో కుప్పకూలి మరణించారని, ఆమె మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. తాడేపల్లిలో ఆందోళన చేస్తున్న వారిని దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌కు తరలించగా వీరిని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు జె.బాలరాజు, ఎన్.యోగేశ్వరరావు ఎం.నాగమల్లేశ్వరరావు, సిహెచ్ పోతురాజు, టిడిపి నాయకులు వి.శ్రీకష్ణ ప్రసాద్, ఎన్.చిరంజీవి, వి.సుధాకర్, ఎన్.రవి పరామర్శించారు. ఈ సందర్భంగా నేతాజి మాట్లాడుతూ నాయకులు లేకుండా అందరిని బెదిరించి కృపమ్మ అంతక్రియలు నిర్వహించాలనే ఉద్దేశంతో అక్రమ అరెస్టులు చేశారన్నారు. ఆశ వర్కర్లకు సెలవులేమీ ఇవ్వడం లేదని, ప్రభుత్వ పరంగా బీమ సౌకర్యాలు కల్పించడం లేదని చెప్పారు. ఈ అంశాలపై రెండేళ్లుగా పోరాడుతున్నా ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడం దారుణమని విమర్శించారు.

దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన నాయకులు, ఆశాలు

విద్యుత్ శాఖ భారీగా అపరాధ రుసుం

(మొదటి పేజీ తరువాయి)

రూ.19 లక్షలు, అదనంగా విద్యుత్ వినియోగిస్తున్న 74 మందికి రూ.2.86 కోట్లు, అసలైన వాడకం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన 2 సర్వీసులను గుర్తించి రూ.30 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు వివరించారు.

మీటర్లకు సీలు తప్పకుండా ఉండేలా వినియోగదార్లు చూసుకోవాలని, సీలు లేకున్నా, తుప్పు పట్టి ఊడిపోయినా, వెంటనే విద్యుత్ సిబ్బందికి రాత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. సాగర తీర ప్రాంతాల్లోని మీటర్లకు ఉన్న సీల్ త్వరగా పాడయ్యే అవకాశం ఉందని చెప్పారు. సీలు లేకపోవడం, ఉద్దేశపూర్వకంగా తొలగించడం, సిల్స్‌కు ఘాట్లు పెట్టడం గమనిస్తే దాన్ని విద్యుత్ చౌర్యంగా పరిగణించే కేసు నమోదు చేస్తామని అన్నారు. పనిచేయని మీటర్ నుండి విద్యుత్ వాడుకున్నా, ఉండాల్సిన మీటర్‌కు బదులు మరో మీటర్ ఉన్నా విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి మొదటి తప్పిదంగా అపరాధ రుసుం విధిస్తామని, అదే తప్పు మళ్లీ చేస్తే ఆ మీటరుదారుణ్ణి అరెస్టు చేస్తామని చెప్పారు. అపరాధ రుసుం చెల్లించలేని వినియోగదారుల నుండి రెవెన్యూ రికవరీ చట్టాన్ని ఉపయోగించి ఆస్తులు జప్తు చేస్తామన్నారు. విద్యుత్ చౌర్యానికి సంబంధించిన ఫిర్యాదుల కోసం 9440812263, 9440812360, 9440812361 నంబర్లను సంప్రదించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. తనిఖీల్లో డిఇఇలు ఎం.రవికుమార్, ఎం.శ్రీనివాసరావు, ఎఇ కె.కోటేశ్వరరావు, ఆపరేషన్ ఎఇ సిహెచ్.కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

రూ.20 లక్షల విలువ చేసే 24 బైకులు స్వాధీనం

నిందితుడు నుండి రికవరీ చేసిన ద్విచక్రవాహనాలు

ప్రజాశక్తి - గుంటూరు సిటి

చెడు వ్యసనాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం సుమారు 24 బైకులు దొంగతనం చేసిన వ్యక్తిని కొత్తపేట పోలీసులు శనివారం పట్టుకొని రిమాండ్ కు తరలించారు. అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం పాతగుంటూరు, బాలాజీనగర్ 5వ లైన్ కు చెందిన ఆవుల రాఘవయ్య శనివారం ఉదయం దొంగిలించిన బైక్‌ను కొత్త పేటలోని మాయాబజార్‌లో అమ్మేందుకు యత్నిస్తుండగా ముందస్తు సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఈస్ట్ ఎఎస్‌పి నచ్చికేట్ షెల్కే ఆధ్వర్యంలో కొత్తపేట సి.ఐ షేక్ అన్వర్ బాషా తన సిబ్బందితో అక్కడికి రావడం చూసిన రాఘవయ్య పారిపోయేందుకు యత్నించాడు. కొత్తపేట ఎస్సై ఎం. లక్ష్మీనారాయణరెడ్డి తన సిబ్బందితో వెంటాడి పట్టుకున్నాడు. నగరంలో రద్దీగా ఉండే వివిధ ప్రదేశాల్లో పార్కింగ్ చేసిన, ఇళ్ల వద్ద రాత్రి సమయాల్లో పార్కింగ్ చేసిన బైకులను నకిలీ తాళాలతో తీసి చోరీకి పాల్పడుతుంటాడు. గత 4 నెలల నుండి గుంటూరు, తెనాలి పరిసర ప్రాంతాల్లో సుమారు 20 లక్షలు విలువ గల 24 బైకులు దొంగతనం చేసినట్లుగా నిందితుడు విచారణలో ఒప్పుకున్నాడు.దొంగిలించిన బైక్‌లను పాతగుంటూరులోనే బాలాజీ నగర్ చివరనున్న పొలాల్లో పిచ్చి చెట్ల మధ్య దాచాడు. వాటిలో ఒక బైక్ ను శనివారం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిఐలు శ్రీని వాసరావు, వెంకన్న చౌదరి ,ఎం లక్ష్మీనారాయణ రెడ్డి, ఎస్సై ఆంటోనీ ,ఏఎస్ఐ వరప్రసాద్, హెడ్ కానిస్టేబుల్, డి.ఎం జానీ, ఎస్.కె కాసిం ,ఎన్ రమేష్, బి.ఉమామహేశ్వరరావు ,ఎన్ రవి, ఆర్ కోటేశ్వరరావు, వై.విజయ్ లను జిల్లా ఎస్పీ అభినందించారు

బాలిక మిస్సింగ్ కేసు నమోదు

ప్రజాశక్తి-కాకుమాను: మండల పరిధిలోని బి.కె పాలెం గ్రామానికి చెం దిన బాలిక రావూరి వైష్ణవి (18) కనబడటం లేదని కేసు నమోదైనట్టు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం..శివరామయ్య, శివపార్వతుల చిన్న కూతూరు వైష్ణవి. పదోతరగతి వరకు చదువుకుంది. ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. ఆమెకు వివాహం చేసేందుకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 2వ తేదీ తెల్లవారుజామున తన తల్లి లేచి చూడగా కూతురు ఇంట్లో లేదు. ఈ విషయమై వారి బంధువులకు చుట్టుపక్కల వారికి సమాచారమిచ్చినా వైష్ణవి ఆచూకీ తెలియలేదు. శివపార్వతి శుక్రవారం కాకుమాను పోలీస్ స్టేషన్‌లోఎస్సై రవీంద్రకు ఈ మేరకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు

గాంధీ విగ్రహం ఏర్పాటుకు రూ.14 లక్షల విరాళం

ప్రజాశక్తి-గుంటూరు

కలెక్టరేట్ ప్రాం గణంలోని లుంబినివనంలో జాతి పిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయటానికి బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ రూ.14 లక్షలు అందచేశారు. శనివారం ట్రస్ట్ ప్రతినిధులు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి ఈ చెక్కును అంద జేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-తెనాలి

విద్యార్థి దశలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కళాశాల యాజమాన్యాలు నిర్వహించే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె హేమచంద్ర రెడ్డి అన్నారు. నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం స్టూడెంట్ ఆక్టివిటీ కౌన్సిల్(షాక్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు. ఈ సంద ర్భంగా 21 విద్యార్థి శాఖలతో 126 మంది విద్యా ర్థులతో ఏర్పాటు చేసిన కౌన్సిల్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

హిందూ ఫార్మశీలో ముగిసిన స్వచ్ఛత హీ సేవా వారోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మశీ కళాశాలలో మహాత్మగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఈ నెల 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు వారం రోజులపాటు ప్రతిరోజు ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విభాగాల సహకారంతో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ విద్యార్థులు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచటం ద్వారా తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పి.సీతారామయ్య , డాక్టర్ ఎ.రాజేష్, జె.శివజ్యోతి, ఎన్‌సిసి ఏఎన్ఒ లెఫ్టినెంట్ సిహెచ్ అజిత్‌బాబు విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఐ.పి. 15/2022

బిట్వీన్
షేక్ చింతపల్లి వలి ... పిటీషనర్
వర్సెస్
1. ఆకుల శ్రీను అండ్ వగైరాలు ... రెస్పాండెంట్లు
To,
27) చట్టు ఆంజనేయులు, S/o అనమయ్య, R/o డోర్ నెం.1-25, పాతురు, యాదవుల బజారు, నకరికల్లు గ్రామం అండ్ మండలం, పల్నాడుజిల్లా.
29) అడ్డరోడ్డు వెంకటరావు S/o అప్పారావు చౌదరి, డోర్ నెం. 2-15, అడ్డరోడ్డు, తిరుపతమ్మ గుడి దగ్గర, నకరికల్లు గ్రామం అండ్ మండలం, పల్నాడుజిల్లా.

సదరు పై నెంబరు పిటీషన్‌లోని పిటీషనరు, రెస్పాండెంటుల 27 & 29 లకు ఎన్ని పర్యాయములు నోటీసులు జారీ చేసినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు రెస్పాండెంట్లుకి పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తం ది. 20-10-2023 వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదాకి మీరు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట స్వయంగా గానీ, అడ్వకేటుగారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పరోక్షమందు తీర్మానించబడును.
వాయిదాతేది : 20-10-2023

పిటీషనరు తరపు న్యాయవాదులు,
పి.హరనాథబాబు,
బి.సలీమ్,
అరండల్‌పేట, నరసరావుపేట.

బహిరంగ ప్రకటన

సూరకట్ల మౌనిక.,భర్త అరుణ కుమార్ అను నేను అన్నపరెడ్డి జ్యోతి (నా తల్లిగారు) వల్ల సమాచారం పొంది జనులెల్లర కు తెలియ జేయునదే మనగా మా నాన్న గారి స్థలము డోర్.నం.28-398, బాబు గారి తోట, సర్వే నం. 58 లో గల 52.12 చ॥అ॥ స్థలంనకు హద్దులు తూర్పు: అన్నపురెడ్డి సుబ్బులు, పడమర: బజారు, ఉత్తరం: అన్నపరెడ్డి సుబ్బులు, దక్షిణం: వేములకొండ అరుణకుమారి. ఈ హద్దుల మధ్య ఉన్న స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించు కొనుట కొరకు సిద్ధంగా వున్నాను. కనుక ఈ ప్రకటన చూసిన వారం రోజులలోపు ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు కానీ ఆక్షేపణలు గాని ఉన్న యడల వారం (7 రోజుల లోపు) రోజుల లోపు పై అడ్రస్సు కు తెలియజేయగలరు. కాల పరిమితి ముగిసిన అనంతరం ఎవరికీని ఎటువంటి అభ్యంతరాలు, ఆక్షేపణలు లేవని, నేను పరిగణించ వలసి వస్తుందని తెలియజేయడమైనది. తదుపరి ఈ స్థలమునకు సంబంధించి పూర్తి హక్కు బాధ్యతలు నాకే ఉంటాయని ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియ జేయడమైనది.

నా అడ్రస్సు
సూరకట్ల మౌనిక, భర్త అరుణకుమార్,
డోర్ నెం. 5-114/A,
భీంగల్,(పోస్ట్ అండ్ మండలం),
నిజామాబాద్ జిల్లా-503307, తెలంగాణ.
సెల్ నెంబర్ : 8919852627

నోటీసు
మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. నెం. 139/2022 ఇన్ ఐ.ఎ. 23/2020
ఇన్ ఓ.యస్. నెం. 04/2020

బిట్వీన్
జవ్వాజి రామారావు ... పిటీషనర్ / వాది
వర్సెస్
యర్రమనేని అచ్చయ్య (లేటు) అండ్ 3 అదర్స్
... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు
టు,
1) రెస్పాండెంట్ నెం.3 :- యర్రమనేని సురేష్ తండ్రి (లేటు) అచ్చయ్య, హిందువు, వయస్సు 38 సం॥లు, నివాసం. డోర్ నెం. 4-115, పండరీపురం చిలకలూరిపేట టౌన్, మండలం.
2) రెస్పాండెంట్ నెం.4 :- బెల్లంకొండ అలియాస్ యర్రమనేని సుజిని, తండ్రి (లేటు) అచ్చయ్య, హిందువు, వయస్సు 35 సం॥లు, నివాసం డోర్ నెం. 5-307/2, పార్కు ప్రక్కన, ఆర్‌టిసి కాలనీ, చిలకలూరిపేట టౌన్ అండ్ మండలం.

పై నెంబరు దావాలో రెస్పాండెంట్ 3, 4 వారలకు 1వ రెస్పాండెంట్‌కు వారసులుగా చేర్చమని పై నెంబరు పిటీషన్ వేయగా సదరు పిటీషన్‌లో మీకు నోటీసులు పంపగా, మీకు ముట్టనందున, మీకు ఈ పేపరు నోటీసు నిమిత్తమై శ్రీ కోర్టువారు ది. 18-10-2023వ తేదీకి వాయిదా వేసినారు. వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, లేదా ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై మీకు ఆక్షేపణలు వున్న తెలుపు కోవలసినది. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.
వాయిదాతేది: 18-10-2023

ఇట్లు
శ్రీ రామినేని ప్రసాద్,
పిటీషనరు తరపు అడ్వకేట్స్,
నరసరావుపేట.

నోటీసు
మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. 140/2022 ఇన్ ఓ.యస్. నెం. 04/2020

బిట్వీన్
జవ్వాజి రామారావు ... పిటీషనర్ / వాది
వర్సెస్
యర్రమనేని అచ్చయ్య (లేటు) అండ్ 3 అదర్స్
... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు
టు,
1) రెస్పాండెంట్ నెం.3 :- యర్రమనేని సురేష్ తండ్రి (లేటు) అచ్చయ్య, హిందువు, వయస్సు 38 సం॥లు, నివాసం. డోర్ నెం. 4-115, పండరీపురం చిలకలూరిపేట టౌన్, మండలం.
2) రెస్పాండెంట్ నెం.4 :- బెల్లంకొండ అలియాస్ యర్రమనేని సుజిని, తండ్రి (లేటు) అచ్చయ్య, హిందువు, వయస్సు 35 సం॥లు, నివాసం డోర్ నెం. 5-307/2, పార్కు ప్రక్కన, ఆర్‌టిసి కాలనీ, చిలకలూరిపేట టౌన్ అండ్ మండలం.

పై నెంబరు దావాలో రెస్పాండెంట్ 3, 4 వారలకు 1వ రెస్పాండెంట్‌కు వారసులుగా చేర్చమని పై నెంబరు పిటీషన్ వేయగా సదరు పిటీషన్‌లో మీకు నోటీసులు పంపగా, మీకు ముట్టనందున, మీకు ఈ పేపరు నోటీసు నిమిత్తమై శ్రీ కోర్టువారు ది. 18-10-2023వ తేదీకి వాయిదా వేసినారు. వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, లేదా ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై మీకు ఆక్షేపణలు వున్న తెలుపు కోవలసినది. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.
వాయిదాతేది: 18-10-2023

ఇట్లు
శ్రీ రామినేని ప్రసాద్,
పిటీషనరు తరపు అడ్వకేట్స్,
నరసరావుపేట.

బహిరంగ వేలము

పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం ఓర్వకల్లు గ్రామపంచాయతీ పరిధిలో నీ శ్రీ గంగమ్మ తల్లి చెరువు సర్వేనెంబర్ 62/2 లోగల 1433-34 ఫసలీకి గాను రెండు సంవత్సరాల కాలంలో చేపలు వేసి పెంచి పట్టుకొనుటకుగాను బహిరంగ వేలము జరుపబడును. ది 10-10-2023 తేదీన అనగా అక్టోబర్ 10వ తేదీన ఉదయం 11-00 గంటలకు అచ్చంపేట మండల పరిధిలోని ఓర్వకల్లు గ్రామపంచాయతీ కార్యాలయము నందు ఉదయం 11 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహించబడుతుంది కావున వేలంపాటలో పాల్గొనదల్చినవారు పదివేల రూపాయల ధరావత్ సొమ్ము చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరు.
(షరతులు వర్తిస్తాయి) **ఇట్లు**
గ్రామపంచాయతీ కార్యదర్శి, ఓర్వకల్లు గ్రామం
అచ్చంపేట మండలం, పల్నాడు జిల్లా.

దస్తావేజులు పోయినవి

గుంటూరు సిటీ, ఏ.టి.అగ్రహారం న్యూ, జూట్‌మిల్లు కాలనీ, రామిరెడ్డి నగర్ కు చెందిన గాదంశెట్టి వెంకటరమణ, తండ్రి గాదంశెట్టి వెంకటేశ్వర్లు (లేటు) నాకు సంబంధించిన దస్తావేజులు గుంటూరు రిజిష్టరు ఆఫీసులో రిజిష్టర్ కాబడిన **దస్తావేజు నెం.6819/1989** దానికి సంబంధించిన **లింకు దస్తావేజు నెం. 3507/1986** మరియు **దస్తావేజు నెం.6818/1989** దానికి సంబంధించిన **లింకు దస్తావేజు నెం. 3509/1986** గల దస్తావేజులను జిరాక్స్ నిమిత్తం ది.05-08-2023న గుంటూరు సిటీ, ఏ.టి.అగ్రహారం న్యూ సెంటర్‌కి వెళ్లుచుండగా మార్గమధ్యంలో పడిపోయినవి. తిరిగి మరల ఎంత వెతికినను దొరకలేదు. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

ఇట్లు
గాదంశెట్టి వెంకటరమణ,
డోర్ నెం.26-32-129/145,
జూట్‌మిల్లు కాలనీ, రామిరెడ్డి నగర్,
ఏ.టి.అగ్రహారం న్యూ, గుంటూరు సిటీ,
సెల్ నెం.9581326644

మహారాజశ్రీ గుంటూరు ఫ్యామిలీ కోర్టువారి దివ్య సముఖమునకు
I.A. 529/2022
F.C.O.P. (D) 379/2021

బిట్వీన్
మల్లెల అమల W/o జోజిబాబు
... పిటీషనరు (రెస్పాండెంటు)
అండ్
మల్లెల జోజిబాబు S/o కోటయ్య, ప్రైవేటు ఉద్యోగి, సాకిన్ పార్వతీపురం, 1వ లైన్, గుంటూరు.
... రెస్పాండెంట్ (పిటీషనరు)

పై నెంబరు పిటీషనులోని పిటీషనరు (రెస్పాండెంటు) ఎక్సపార్టీ డిక్రీ ఆఫ్ డైవోర్స్ రద్దు చేయించమని కోరుతూ పిటీషను దాఖలు చేయగా పై కోర్టు ద్వారా చాలా పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందునవలన ఈ కోర్టు ప్రకటన ద్వారా నోటీసు ది. 20-10-2023న వాయిదా అయినందువలన సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరయి మీ ఆక్షేపణలు తెలియపరచు కొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.
వాయిదాతేది : 20-10-2023
గుంటూరు.
ది.7-10-2023 **ఎస్.బ్రహ్మానందరెడ్డి,**
పిటీషనరు (రెస్పాండెంటు) తరపు అడ్వకేటు,
గుంటూరు.

శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు
గౌరవనీయులైన శ్రీ అదనపు సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో, నరసరావుపేట.
ఐ.పి. నెం. 42/2021

బిట్వీన్
షేక్ అబ్దుల్ రహీం ... వాది
వర్సెస్
కన్నెసాని కళ్యాణ్ మరియు ఇతరులు ... ప్రతివాదులు
1) మద్దినేని మురళీ తండ్రి : వెంకయ్య, వయస్సు 35 సం॥లు, శ్రీ చైతన్య టెక్నో స్కూల్ దగ్గర, రామిరెడ్డిపేట, నరసరావుపేట. .... 9వ రెస్పాండెంట్

సదరు పై నెంబరు ఇ.పి.లోని పిటీషనరు తనను ఇన్సాల్వెంటుగా ప్రకటించమని ఇందలి ప్రతివాదులపై ఐ.పి. దాఖలు చేసియున్నారు. సదరు ఐ.పి.లో 9వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా అనేక పర్యాయములు నోటీసులు పంపిననూ, మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టువారు ది. 20-10-2023వ తేదీకి వాయిదా వేసినారు. కావున వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, లేదా ప్లీడరుగారి ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలు వున్న తెలుపుకోవలసినది. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది: 20-10-2023
నరసరావుపేట,
తేది: 08-10-2023

ఇట్లు
శ్రీ సాంబశివరావు కొండా
శ్రీ యం.సుబ్బారావు,
వాది తరపు న్యాయవాదులు,
నరసరావుపేట. సెల్ ం 9866738537

ఆర్డర్ 5 రూల్ 20 సి.పి.సి ప్రకారం జె.డి.ఆర్ కి నోటీసు
శ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : అద్దంకి
E.P.12/21 in O.S. 48/2015

చెన్నంశెట్టి శశికుమార్ ...డి.హెచ్.ఆర్
వర్సెస్
ఉదయగిరి నాగేశ్వరరావు ...జె.డి.ఆర్
టు:
శ్రీ ఉదయగిరి నాగేశ్వరరావు S/o వెంకటరావు, (జె.డి.ఆర్) వర్కింగ్ ఇన్ ఇండియన్ మిలిటరీ, వరగాని గ్రామం, పెదనందిపాడు మండలం, గుంటూరు జిల్లా,

పై నెంబరు E.P. లో జె.డి.ఆర్ పై ఆర్డర్.21 రూల్.11,32 & 34 సి.పి.సి కింద డి.ఎచ్.ఆర్ E.P దాఖలు చేయగా జె.డి.ఆర్ అయిన శ్రీ ఉదయగిరి నాగేశ్వరరావు S/o వెంకటరావుకు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్ట్ వారి ఆదేశాల మేరకు జె.డి.ఆర్ కు ఆర్డర్ 5 రూల్ 20 సి.పి.సి. ప్రకారం పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీచేయుటకై శ్రీ కోర్టు వారు ఆర్డర్ వేసియున్నారు. సదురు కోర్టు వారి ఉత్తర్వులు మేరకు వాయిదా తేదీన అనగా తేది. 30.10.23, ఉ.10.30 గంటలకు మీరు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు స్వయముగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ తెలుపుకొనవలసియున్నది. లేని యెడల, అదే రోజు మీ పరోక్షములో తీర్పు ఇవ్వబడునని తెలియచేయడమైనది.
వాయిదా తేదీ, 30, 10.23
తేది : 06-10-2023

P. L. N. PRASAD B.A. B. L
న్యాయవాది అద్దంకి,
సెల్ నం: 9848080806

అచ్చంపేట తహశీల్దార్ కార్యాలయంలో వితిపత్రం ఇస్తున్న ఆశాలు

కృపమ్మ మృతిపై ఆశాల ఆగ్రహం, ఆవేదన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా విలేకర్లు

పని వత్తిడి, అధికారుల వేధింపుల వల్ల గుంటూరు జిల్లా, తాడేపల్లిలో ఆశ కార్యకర్త రేపూడి కృపమ్మ మృతి చెందారని ఆశా కార్యాకర్తలు ఆవేదన, ఆగ్రహానికి గురయ్యారు. ఈ మేరకు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం పలుచోట్ల విధులను బహిష్కరించి నిరసనలు చేపట్టారు. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో నిరసన తెలపగా సిఐటియు మండల కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ మాట్లాడారు. వివిధ రకాల పేర్లతో ఆశా కార్యకర్తలకు టార్గెట్లు పెట్టి పనిభారం పెంచడమే కాకుండా ఒత్తిడికి గురిచేస్తున్నారని అన్నారు.

చిలకలూరిపేట

నరసరావుపేట

పనిభారం తగ్గించాలని, వారిని కార్మికులకు గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో యశోద, యామిని, రోజా, ధనలక్ష్మి, మెహర్నిస్సా, రిహన పాల్గొన్నారు. చిలకలూరిపేటలోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి అనంతరం సంతాప సభ నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. మృతురాలి కుటుంబానికి న్యాయం కోసం పోరాడుతుంటే అరెస్టులు, నిర్బంధం దారుణమని మండిపడ్డారు. కె.మరియమ్మ, వి.వెంకటలక్ష్మి, పి.శ్రీదేవి, వి.రాజేశ్వరి, ఎస్.చిన్న, ఎం.విల్సన్ పాల్గొన్నారు. అచ్చంపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశాలు ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు మాట్లాడారు. రకరకాల యాప్‌లు, రికార్డులను పెంచి జాబ్‌ఛార్టుకు సంబంధం లేని పనులను ఆశాలతో చేయిస్తున్నారని విమర్శించారు. జగనన్న సురక్ష సర్వేలో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని అన్నారు. నాయకులు కె.సుబ్బారావు, పద్మ, రాజకుమారి, అనిత, శీరీష, షేక్ ఖాశింబీ, మహాలక్ష్మి, సుహాసిని విజయకుమారి, మరియమ్మ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను ఉపయోగించుకోండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా వైద్యాధికారి బి.రవి అన్నారు. మండలంలోని కంటిపూడిలో శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించారు. కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఒ చంద్రశేఖర్, డాక్టర్ గౌతమీ, అనూషా, హరీఫ్, రామచంద్రరావు మూర్తి పాల్గొన్నారు.

30 ఏళ్లుగా అదేగతి

- సరైన రహదార్లకూ నోచని బేడ బుడగ జంగాల కాలనీ
- ఇళ్లేదుటే మురుగు నిలిచి నిత్య దుర్గంధం
- రోగాల బారిన పడుతున్నా పారిశుధ్య చర్యలు శూన్యం
- 'గడపగడపకు మన ప్రభుత్వం'లో విన్నవించినా మారని దుస్థితి

ఇళ్లేదుట నిలిచిన డ్రెయినేజీ నీటిలో ఉన్న తాగునీటి పైపులైన్లు

కాలనీ ప్రధాన రహధారి

ప్రజాశక్తి - కారెంపూడి

సరైన రహదార్లు ఉండవు.. విద్యుత్ లైట్లు ఎప్పుడు వెలుగుతాయో తెలియదు.. ఇంటి ఎదుట మురుగు నీరు నిత్యం దుర్గంధం వెదజల్లుతున్నా ఏమీ చేయలేని పరిస్థితి.. జ్వరాలతో మంచం పట్టినా పారిశుధ్య పనులు చేసే దిక్కే ఉండదు.. మండలంలోని పేటసన్నిగండ్ల పంచాయతీ పరిధిలోని బేడ బుడగ జంగాల కాలనీలో 30 ఏళ్లుగా ఇదే దుస్థితిని స్థానికులు అనుభవిస్తున్నారు.

మంచి ఆదాయం ఉన్న పంచాయతీ పరిధిలోనే ఈ ప్రాంతమున్నా అభివృద్ధి మాత్రం తీసికట్టుగా ఉంది. 30 ఏళ్ల కిందట ఏర్పడిన ఈ కాలనీలో 150 కుటుంబాల వరకూ జీవనం సాగిస్తున్నాయి. అందరూ రెక్కాడితేగాని డొక్కాడని కూలీలే. ఈ కాలనీకి రహదార్ల సదుపాయం లేదు. మట్టిరోడ్లపైనే ఏళ్ల తరబడి రాకపోకలు సాగిస్తున్నారు. వర్షం వస్తే వీరి బాధ వర్ణానాతీతం. డ్రెయినేజీ కాల్వలు లేకపోవడంతో కాలంతో సంబంధం లేకుండా నిత్యం ఇళ్ల ఎదుటే మరుగునీరు నిలిచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అదె డ్రెయినేజీ నీళ్లలో నుండి తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. పలువురు తరచూ రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం ఈ కాలనీలో 15 మందికిపైగా విషజ్వరాలతో మంచం పట్టారు. అయినా పారిశుధ్య పనులు చేపట్టిన దాఖలాలు లేవు. విద్యుత్ లైట్లు ఉన్నా అవి సరిగా వెలగడం లేదని, రహదార్ల వెంట పిచ్చి మొక్కలు పెరిగిన నేపథ్యంలో వాటిల్లో నుండి పురుగు, పుట్రా బయటకు వస్తాయోనని రాత్రి వేళలల్లో భయభయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదనకు గురవుతున్నారు. సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికలప్పుడు హామీలిస్తున్న నాయకులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదని ఇక్కడివారు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు.

రెండు నెలల కిందట ఈ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఎమ్మెల్యే ఎదుట స్థానికులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున మంజూరయ్యే నిధుల్లో రూ.10 లక్షలను ఈ కాలనీలో అభివృద్ధి పనులకు వెచ్చించాలని ఎమ్మెల్యే ఆదేశించారని, అయినా ఫలితం లేకపోయిందని స్థానికులైన పెల్లూరి పెద్ద లింగయ్య, భిక్షం వెంకటేష్, ఆలేటి వెంకటేష్, తిరుపతయ్య, శ్రీపాటి భిక్షం ఆవేదనకు గురయ్యారు. దీనిపై సర్పంచ్ నాగేంద్రను వివరణ కోరగా కాలనీని పరిశీలిస్తామని, స్థానికులకు ఇబ్బందులేమీ లేకుండా సమస్య పరిష్కారానికి నిధులు కేటాయిస్తామని చెప్పారు.

పేద విద్యార్థిని ఉన్నత చదువుకు స్నేహహస్తాలు సాయం

ప్రజాశక్తి-అచ్చంపేట

ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బంది భారం కాకూడదనే ఉద్దేశంతో పేద విద్యార్థులకు ఆర్థికసాయం చేస్తున్నట్లు స్నేహ హస్తాలు ఫౌండేషన్ నిర్వాహకులు చెప్పారు. మండలంలోని తాడువాయికి చెందిన సలికేటి అంజలి అనే విద్యార్థికి బాపట్లలోని వ్యవసాయ కళాశాలలో ఎంఎస్సీ రెండో సెమిస్టర్ చదువుతున్నారు. ఆమెకు కాలేజీ ఫీజు నిమిత్తం రూ.25 వేలను ఫౌండేషన్ తరుపున మండల ప్రతినిధి మామిళ్లపల్లి విజయలక్ష్మీ, కో-ఆర్డినేటర్ టి.కరిముల్లాబాబు శనివారం అందించారు. నాలుగేళ్ల క్రిత బీఎస్సీ చదివేటప్పుడు హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.లక్ష అందించామని, అనంతరం ఎంఎస్సీ మొదటి సెమిస్టర్‌కు రూ.25 వేలు ఇచ్చామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ తన చదువు పూర్తయ్యాక ఫౌండేషన్‌తో కలిసి పని చేస్తానని చెప్పారు.

సామాజిక న్యాయం కోసం పోరాటాలు

- 22 డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 4న చలో ఢిల్లీ
- పల్నాడులో కరువు పరిస్థితుల నేపథ్యంలో కూలీలను ఆదుకోవాలి : వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

సామాజిక న్యాయం కోసం ఎస్సీ, ఎస్టీలు గళమెత్తాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి అన్నారు. సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశం శనివారం మండల కేంద్రంమైన ముప్పాళ్లలోని జగన్నాథ స్వామి గుడి వద్ద శనివారం నిర్వహించగా శివనాగరాణి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, మహిళలపై దాడులు పెద్ద ఎత్తున పెరిగాయని ఆందోళన వెలిబుచ్చారు. దాడుతలతోపాటు వివక్షకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) సంయుక్త ఆందోళనలు చేపట్టినట్లు చెప్పారు. ఇందులో భాగంగా హైదరాబాదులో జరిగిన జాతీయ సదస్సులో 22 డిమాండ్లతో కూడిన చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌ను రూపొందించామని, వీటి కోసం దేశవ్యాప్తంగా ఆందోళన ప్రారంభించామని తెలిపారు. ఇటీవలే విజయవాడలో మహాధర్నా జరిగిందని, డిసెంబర్ 4న చలో ఢిలీ నిర్వహించనున్నామని, కోట్లాది సంతకాలు సేకరించి రాష్ట్రపతి ద్రౌపతి ముర్మకు విన్నవించనున్నామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసైన్మెంట్ చట్ట సవరణ చేసి, 20 ఏళ్లు దాటిన అసైన్మెంట్ భూముల్ని అమ్ముకోటానికి హక్కిస్తున్నామని ప్రకటించిందని, కానీ ఎస్సైన్మెంట్ భూములు వేలాది ఎకరాలు అన్యాక్రాంతమైనా వాటిపై విచారణకు సిద్ధం కావడం లేదని విమర్శించారు. నిబంధనల ప్రకారం ప్రతి గ్రామ సచివాలయంలోనూ ఆ గ్రామానికి చెందిన అసైన్మెంట్ భూములు జాబితాలు ప్రకటించాలని, కానీ ఎక్కడా అది అమలు జరగలేదని అన్నారు. అసైన్మెంట్ భూముల ప్రస్తుత పరిస్థితిని నిర్ధారించి నిషేధిత భూముల జాబితా 22ఎ సెక్షన్ కింద నుంచి ఆ భూములను తొలగించాల్సి ఉంటుందన్నారు. పల్నాడు జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు రాబోతున్నాయని, సాగర్ నీళ్లు లేనందువల్ల మాగాణి పంట దాదాపుగా ఎక్కడ వేయడం జరగలేదని చెప్పారు. అడపాదడపా పడుతున్న వర్షాలతో పత్తి, మిర్చి పంటలు మాత్రమే జిల్లాలో సాగుచేశారని, ఈ నేపథ్యంలో వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదని వివరించారు. వర్షాభావం వల్ల పంటలు పరిస్థితి మరింత దిగజారి కరువు తలెత్తే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితులన్నింటినీ గమనించి రాష్ట్ర ప్రభుత్వం కంటిన్జెంట్ ప్రణాళికలు సిద్ధం చేసి, వ్యవసాయ కూలీలని ఆదుకోవాలని కోరారు. కరువు, ఉపాధి, అసైన్మెంట్ భూములు, సామాజిక న్యాయం సమస్యలపై చేపట్టే పోరాటాల్లో కూలీలు కదలిరావాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య, నాయకులు బి.కోటమ్మ, జె.భగత్, బి.బాలకోటయ్య, ఎ.వెంకటేశ్వర్లు, పి.సైదాఖాన్, ఎన్.వెంకటేశ్వరరాజు, సిహెచ్.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి

ప్రజాశక్తి
గుంటూరు
5
ఆదివారం 8 అక్టోబర్ 2023

ఆశా వర్కర్లపై పనిభారం తగ్గించాలి

పని వత్తిడితో మృతి చెందిన ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని ఆశాలు డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గ మని ఆశాలు మండి పడ్డారు. పోలీసులు, అధికారుల చర్య లను నిరసనగా గుంటూరు జిల్లాలో ఆశాలు నిరసన తెలిపారు.

మృతురాలు కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలి

అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలి

జిల్లా వ్యాపితంగా ఆశాల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు :తాడేపల్లిలో ప్రభుత్వ ఒత్తిళ్లతో చనిపోయిన ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ శనివారం స్థానిక లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామ హేశ్వరరావు మాట్లాడుతూ బాధితురాలికి న్యాయం చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న యూనియన్ నాయకుల్ని అక్రమంగా అరెస్ట్ చేయటం అత్యంత దుర్మార్గం అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆశా వర్కర్లు నిద్రాహారాలు మాని పనిచేస్తున్నా రన్నారు. దీని వల్లనే చిత్తూరు జిల్లాలో జానకి, ఇప్పుడు తాడేపల్లిలో కృపమ్మ మృతి చెందారన్నారు. ఇవి ఆత్మహత్యలు కావాని ప్రభుత్వ హత్యలని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు మాట్లాడుతూ చనిపోయిన ఆశా వర్కర్లకు కనీసం రూ.50లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లపై పనిభారం తగ్గించాలని కోరారు. కార్యక్రమానికి యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సిఐటియు పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ జిల్లా నాయకులు పవన్‌కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర ప్రధాన కార్యదర్శి ఖాసింవలి, అపార్ట్‌మెంట్స్ వాచ్‌మెన్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు ఆది నికల్సన్, ఆశా వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి హరీష, దుర్గ, అనిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం : మండల కేంద్రంలో నిరసన కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్ఎం వలి మాట్లాడారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ ఎం లక్ష్మి, ఆర్.విజయరాణి, రత్నకమల, కే జ్యోతి పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు అబ్రహం శ్రావణ్, హానోక్ మీద ప్రజాసంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు ప్రత్తిపాడు మండల అధ్యక్షురాలు కే జ్యోతి డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు పిలుపులో భాగంగా ప్రత్తిపాడు మండల కేంద్రం,గొట్టిపాడు సెక్టార్లో యనమదల లో ఆశా వర్కర్లు నిరసన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పంతగాని ధనలక్ష్మి, నాయకులు, రమణ సిరాజ్ బాలంకమ్మ నిరోషా విమల కుమారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు :మండల కేంద్రంలో కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. సిఐటియు మండల నాయకులు షేక్ బాషా ఆధ్వర్యంలో మండలంలోని 14 గ్రామాలకు చెందిన ఆశా వర్కర్లు ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం ఆశా వర్కర్లు పలు రకాల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ అనిరుద్‌కు ఇచ్చారు. మండలంలోని మందపాడులో నిరసన తెలిపారు.

ప్రజాశక్తి - వట్టిచెరుకూరు : తాడేపల్లి లో విధులు నిర్వహణ క్రమంలో ఒత్తిడిలకు లోనై హార్ట్ ఎటాక్ తో చనిపోయినటువంటి ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వట్టిచెరుకూరు మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల అధ్యక్షులు యన్.నాగరాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి లక్ష్మణరావు మాట్లాడుతూ ఆశా వర్కర్లపై పెద్ద ఎత్తున పనిబారాలు మోపుతున్నారని, జగనన్న సురక్ష ప్రారంభం నుండి తీవ్రమైనటువంటి ఒత్తిడిలో ఆశ వర్కర్లు ఉన్నారని అన్నారు. చనిపోయి నటువంటి కృపమ్మ వయసు కేవలం 38 సంవత్సరాలకే హార్ట్ ఎటాక్ రావటం అంటే ఏ స్థాయిలో ఆశ వర్కర్లపై ఒత్తిడి ఉందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. రాష్ట్రంలో మరొక ఏ ఆశా వర్కర్ కూడా ఇటువంటి వాటికి బలికాకుండా ఉండాలంటే జాబ్ చార్ట్‌లో పనులు మాత్రమే చేయించాలని, సంబంధం లేని పనులలో ఆశ వర్కర్లను ఇన్వాల్వ్ చేయకూడదన్నారు. ఆమె కుటుంబం ఒక న్యాయం జరిగే వరకు సిఐటియు పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీ, ధనలక్ష్మి భాను, రజిని,శ్రీవిద్య,వరదానమ్మ శౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్ : పెదకాకాని సిఐటియు కార్యాలయం నుండి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలను, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. ధనలక్ష్మి, గుంటూరు జిల్లా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, ఆశా నాయకురాలు లక్ష్మి నీఅక్రమంగా అరెస్టు చేసి తాడేపల్లి పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారు. శనివారం ఉదయం 6:30 గంటలకు మహిళలు అని కూడా చూడకుండా కే.ధనలక్ష్మి లక్ష్మీ తదితరులను బలవంతంగా వాహనాల్లో ఉదయం నుండి గుంటూరు జిల్లాలో వివిధ స్టేషనులకు తిప్పుతూ ధనలక్ష్మి కొంతమందిని పెద్దకాకాని పోలీస్ స్టేషన్ కి తరలించారు. చనిపోయిన ఆశ కార్యకర్త కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయకుండా న్యాయం కోరిన ఆశాల సీఐటీయ నాయకుల అక్రమ అరెస్టులను నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో బురదగుంట సాంబయ్య, షేక్ హసీనా, కేసాని లక్ష్మి,ఎం.వెంకాయమ్మ, వెంకట రమణ, ఏ.నాగేశ్వరరావు పి.హసీనా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ :తాడికొండ అడ్డరోడ్డు వద్ద ఆశవర్కర్లు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు యడ్లపలి గాంధీ రాంమోహనరావు, మండల రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, రేపూడి శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు కుక్కమల్ల జ్యోతి సాయి లత, మేరీ, రమణి, రాజశ్రీ, షేక్ మజీదా పాల్గొన్నారు.

గుంటూరులో నిరసనలో పాల్గొన్న నాయకులు, ఆశాలు

వట్టిచెరుకూరు

పెదకాకానిలో

ఫిరంగిపురంలో

ప్రత్తిపాడులో

తాడికొండలో

మేడికొండూరులో

10,11తేదీల్లో సిపిఎం పాదయాత్ర

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్ర 10, 11 తేదీల్లో మంగళగిరి పట్టణంలో జరుగుతుందని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి వై.కమలాకర్ తెలిపారు. ఈ మేరకు స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 10న రత్నాల చెరువు సింహాద్రి శివారెడ్డి భవనం నుండి యాత్ర ప్రారంభమవుతుందని, పాత మంగళగిరి, మంగళగిరి మెయిన్ రోడ్డు, గౌతమ్ బుద్ధ రోడ్‌లోని విజెడిఎల్‌బి డిగ్రీ కళాశాల వరకు ఉంటుందని, 11న ఒకటో వార్డులోని సిపిఎం కార్యాలయం నుండి ప్రారంభమై కొండ ప్రాంతం, మూడో వార్డులోని అన్ని ప్రాంతాల్లో యాత్ర ఉంటుందని వివరించారు. ప్రజలెదుర్కొంటున్న సమస్యలను పాదయాత్ర బృందం దృష్టికి తేవాలని కోరారు. సమావేశంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, నాయకులు ఎం.చలపతిరావు, ఎం.బాలాజీ, ఎస్.గణేష్, జె.నవీన్‌ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారు నాగర్జునరెడ్డి పర్యటన

ప్రజాశక్తి-తెనాలి

పంచాయతీ రాజ్, రూరల్ డెవలవ్‌మెంట్ విభాగం ప్రభుత్వ సలహాదారు కె.నాగార్జునరెడ్డి శనివారం పట్టణ, రూరల్ పరిధిలో పర్యటించారు. తొలుత రూరల్ గ్రామం అంగలకుదురు చేరుకున్న ఆయన అధికారులతో కలిసి ఎన్ఆర్ఈజిఎస్ పనులు పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. అదే గ్రామంలో సచివాలయం, స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలోని వైఎస్సార్ అగ్రిటెస్టింట్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోలో పొందుపరచిన ప్రతి హామీని దాదాపుగా నెరవేర్చినట్లు చెప్పారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచారని, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలరని, సచివాలయ వ్యవస్థ ధ్వారా పాదర్శకంగా ప్రజల సమస్యలు పరిష్కరిచబడుతున్నాయని, ప్రభుత్వం అందించే సంక్షేమం నేరుగా లబ్దిదారు ఖాతాలోకే చేరుతోందన్నారు. అయినప్పటికీ ఇంకా ఏవైనా సమస్యలుంటే అధ్యయనం చేసి ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకువెళ్లేందుకు పర్యటిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎంపిడివో ఎల్ విజయాలక్ష్మిన్, పిఆర్ ఏఈ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

దేశవ్యాప్తంగా కుల గణన చేయాలి

నేడు తాడేపల్లిలో బిసి సంక్షేమ సంఘం విస్తృత సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి

దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని, కులాల జనాభా ప్రాతిపదికనే రాజకీయంగా సీట్ల రిజర్వేషన్ ఉండాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్రావు డిమాండ్ చేశారు. మంగళగిరి బైపాస్ రోడ్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయాన్ని శనివారం ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ దేశంలో మొట్టమొదటిసారిగా కుల గణన చేయించారని అన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వమూ కుల గణన చేస్తామని చెప్పి చేయలేదన్నారు. బీసీలకు ఒక్కొక్క పార్లమెంటు పరిధిలో మూడు అసెంబ్లీ సీట్లు రాజకీయ పార్టీలు కేటాయించకుంటే బీసీ సంక్షేమ సంఘం రాజకీయ పార్టీగా ఆవిర్భవించడానికి కృషి చేస్తామని చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృత సమావేశం ఆదివారం తాడేపల్లిలో నిర్వహిస్తామని తెలిపారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షులు కాంద్రు కమల మాట్లాడుతూ పార్లమెం టులో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించినా ఓబీసీ మహిళా రిజర్వేషన్ గురించి ప్రస్తావించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. దీనికోసం ఉద్యమి స్తామని చెప్పారు. సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పి.మహేష్, టి.కిరణ్, యు.శ్రీనివాసరావు, కె.శివరామ బాబాజి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నా మాస్టరును ఘనంగా సత్కరించారు.

తల్లిదండ్రుల సంక్షేమాన్ని మరవకూడదు

వృద్ధుల దినోత్సవంలో శాసన మండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

ఆధునిక సమాజంలో కుటుంబాల్లో ఆస్తి పంపకాలపై ఉన్న శ్రద్ధ, తల్లిదండ్రుల సంక్షేమంపై ఉండట్లేదని, ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఉందని శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు శనివారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన మండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంధాలు డబ్బులకే పరిమితం అయ్యాయని, తల్లిదండ్రుల్ని వృద్ధాశ్రమాల్లో ఉంచి డబ్బులు పంపిస్తే సరిపోతుందనే భావనలో ఎక్కువ మంది ఉంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో సాధారణంగానే ప్రభుత్వాలపై వృద్ధుల ఆకాంక్షలు, ఆశలు పెరుగుతున్నాయన్నారు. గతం కంటే ప్రస్తుత ప్రభుత్వం వృద్ధుల సంక్షేమానికి మెరుగ్గా పనిచేస్తుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు ఇంటికే తీసుకొస్తుందని, అలాగే రేషన్, ఇతర సంక్షేమ పథకాలు, వైద్యం కూడా ఇంటి ముంగిటకే తీసుకొస్తుందన్నారు. వివిధ సంఘాల కోరిక మేరకు సీనియర్ సిటిజన్స్ కార్యాలయాలు ప్రతి జిల్లాల్లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, అందుకోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎపి సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు సిహెచ్.పరమేశ్వరరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ ఏఎంజి ఉమామహేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ రత్నసాగర్, గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.కైలాష్‌నాద్, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేసన్ రాష్ట్ర అధ్యక్షులు జి.ప్రభుదాసు తదితరులు మాట్లాడుతూ వయోవృద్ధులు, పెన్షనర్ల సమస్యలను ప్రస్తావించారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రత్యేకమైన సేవలు అందించిన వయోవృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్ధుల శాఖ ఏడీ సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న అధికారులు, వివిధ సంఘాల నాయకులు

రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఎరువులు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతు భరోసా కేంద్రాల సేవలను సలహాలు సూచనల ద్వారా రైతులు సాగు చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ. మురళి అన్నారు. శనివారం నరసరావుపేట మండలంలోని పెద్దరెడ్డిపాలెం, జొన్నలగడ్డలలోని రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రం లో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఖరీఫ్ సీజన్లో వేసిన పంటలు అన్నింటికి ఈ నెల 9 లోగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

వివాద రహిత గ్రామంగా తురగావారిపాలెం

ప్రజాశక్తి-అమరావతి

సత్తెనపల్లి న్యాయస్థానాల పరిధిలో వివాద రహిత గ్రామంగా తురగావారిపాలెంఎంపిక కావడం తో ఇక్కడి గ్రామస్తులు ఆదర్శంగా మారారని, వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామని సత్తెనపల్లి సీని యర్ సివిల్ జడ్జి , సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికరా కమిటీ చైర్మన్, డి. నాగవెంకటలక్ష్మీ అన్నారు. మండల పరిధిలోని మునగొడు కో ఆపరేటివ్ సొసైటీ ప్రాంగణంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకట లక్ష్మీ మాట్లాడుతూ తు భవిష్యత్ లో కూడా ఇదే రికార్డ్ కొనసాగించాలని ఆకాంక్షించారు.

యాప్స్, ఓటీపీలతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రెంటచింతల

యాప్స్, ఓటీపీలతో మోసపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్యామ్యూల్ రాజీవ్ కుమార్ అన్నారు. శనివారం స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సలక పారలు కొనుగోలు చేయడానికి వచ్చి షాపు యజమాని వద్ద నుంచి సెల్ తీసుకుని విడతల వారీగా 99 వేల రూపాయలు ఫోన్ పే ద్వారా డ్రా చేసుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఫోన్ పే లో డబ్బులు ఉన్నప్పుడు ఇతరులకు వారి సెల్‌ఫోన్ ఇవ్వొద్దని, మెసేజ్ లకు స్పందించవద్దని, ఓటీపీ ఎవరికీ చెప్పొద్దని సూచించారు.

దిడుగు సమీపంలో గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -అమరావతి

మండల పరిధిలోని దిడుగు గ్రామ సమీపంలో ఎస్సీబీ ఇన్చార్జి సిఐ మల్లాది భుజంగరావు ఆధ్వర్యంలో 300 గ్రాముల గంజాయిని శనివారం రాత్రి పట్టుకున్నారు. పెదకూరపాడు ఎస్సీబీ ఎస్సై ఫణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం నుంచి అంకమ్మరావు అనే వ్యక్తి అమరావతికి చెందిన షేక్ ఇబ్రహీం కి దిడుగు సమీపంలో గంజాయి అందిస్తున్న సమయంలో ఎస్సీబీ అధికారులు సిబ్బందితో కలిసి మెరుపు దాడి నిర్వహించి పట్టుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై ఫణికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతి సబ్జెక్టుపైనా సమాన దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని అమీన్ సాహెబ్ పేట జిల్లా పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శనివారం పర్యటించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులలో ఫార్మేటివ్ అసెస్మెంట్ టెస్ట్‌బి2 లో ముందు వరుసలో నిలిచిన విద్యార్థులతో సెల్ఫీ తీసుకునే కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు విద్యార్థినీవిద్యార్థులతో సెల్ఫీ తీసుకొని వారితో ముచ్చటించారు. ప్రతి సబ్జెక్టులోనూ సమాన దృష్టి పెట్టి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. లక్ష్యాలను ముందుగానే నిర్దేశించుకుని వాటికి అనుగుణంగా పక్కా ప్రణాళికతో చదువుకోవాలని చెప్పారు. విద్యార్థినీ విద్యార్థులకు చాక్లెట్లు బహుకరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్గొన్నారు..

విద్యార్థినీ విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న కలెక్టర్

టిడిపి ఫ్లెక్సీల తొలగింపుపై ఆగ్రహం

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలంలోని నాగిరెడ్డిపాలెంలో అధికారులు తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలను బలవంతంగా తొలగించి, వైసిపి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై టిడిపి సానుభూతి పరులు భగ్గుమన్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు.. గ్రామానికి చెందిన నలుగురు అన్నదమ్ములు కలిసి గతంలో ఒక స్థలం కొనుగోలు చేసి పంచుకొని తమ నివాసాలకు సొంతంగా రహదారి ఏర్పాటు చేసుకున్నారు. ఇందు కోసం బాట వదులుకున్నారు. ఇటీవల నిర్మించిన సచి వాలయం, రైతు భరోసా కేంద్రాలకు వెళ్లే వారు ఆ బాట ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. ఇదే దారిపై గతంలో లోకేశ్ పాదయాత్ర సందర్భంగా టిడిపి మద్దతుదారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. తాజాగా గురువారం సర్పంచ్ గంగిరెడ్డి హనుమాయమ్మ గ్రామ సచివాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

నాగిరెడ్డిపాలెంలో రోడ్డుకు అడ్డంగా ఉంచిన అరకులు

కూడా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో దారివెంట ఉన్న టిడిపి ఫ్లెక్సీలను పంచాయతి సిబ్బంది తొలగించి, వైసిపి ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీంతో, టిడిపి సానుభూతిపరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము ఏర్పాటు చేసుకున్న రోడ్డుపై పంచాయతి అధికారులు నడవొద్దంటూ శుక్రవారం ఉదయం అరకలు, ఎద్దుల బండ్లను అడ్డుగా పెట్టారు. గ్రామ సచివాలయం వద్దకు వెళ్లే దారిలేక సిబ్బంది వెనక్కి వెళ్లారు. పోలీసులు వచ్చి కాలనీ వాసులకు సర్ది చెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.

సత్రం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయండి

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

కోటప్పకొండలో లంబాడి, సుగాలీలకు సత్రం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి, తహశీల్దార్ రమణ నాయక్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోటప్పకొండలో అన్ని కులాల వారికి సత్రాలు ఉన్నాయని , అదేవిధంగా లంబాడి,సుగాలీలకు కూడా సత్రం ఉండాల్సిన ఆవశ్యకత గురించి ప్రస్తావించారు. అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు బి.శ్రీను నాయక్, ఉపాధ్యక్షులు దేవర డేవిడ్, కోశాధికారి బి. రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

'బిజెపి కుహనా రాజకీయం తగదు'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

దేశ ప్రజలంతా రాహుల్ గాంధీలో ఉత్తమ పురుషుడు ,ఆద ర్శ ప్రజా పాల కుడైన శ్రీరాముని చూస్తుంటే ఒక్క బిజెపి నాయకులకు మాత్రమే రావణాసురుడు ఎలా కనిపిస్తున్నాడో వివరించి చెప్పాలని రాహుల్ గాంధీని రావణాసురుడుగా చిత్రించిన బిజెపి కుహనా రాజకీయాన్ని ప్రతి కాంగ్రెస్‌వాది ఖం డించాలని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి, చిలకలూరి పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం.రాధాకృష్ణ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రతిష్టకు భంగం కలిగించేలా పోస్టర్ రూపొందించిన బిజెపి బేషరతుగా క్షమాపణ చెప్పని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నాణ్యమైన పత్తి ఉత్పత్తికి చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నాణ్యమైన పత్తి ఉత్పత్తి కోసం బెటర్ కాటన్ ఇనిషియేటీవ్ ప్రాజెక్టును రూపొందించినట్టు చేనేత , జౌళి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ కె.సునీత పేర్కొన్నారు. ప్రపంచ పత్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బెటర్ కాటన్ ఇనిషియేటీవ్ ప్రాజెక్టుపై ప్రత్తి రైతులు వ్యవసాయ కూలీల అవగాహన సదస్సును ఆమె ప్రారంభించారు. బెటర్ కాటన్ ఇనిషియేటీవ్ ప్రాజెక్టును ప్రారంభించి పోస్టర్ , బ్రోచర్ ను ఆవిష్కరించారు. ప్రత్తి సాగు, జిన్నింగ్, స్పిన్నింగ్ నుండి వస్త్ర తయారీ వరకు అన్ని దశల్లోనూ సరైన జాగ్రత్తలు తీసుకొని ముందుకు సాగితేనే చేనేత, జౌళి రంగం మనుగడ ఆశాజనకంగా వుంటుందన్నారు. నాణ్యమైన ప్రత్తి దిగుబడిలో అవరోధాల కారణంగా రైతులు మంచి ధర పొందలేక పోతున్నారని అన్నారు. ప్రకృతి విపత్తులు, చీడ పీడలు, పురుగు మందుల

బ్రోచరును ఆవిష్కరిస్తున్న కె.సునీత తదితరులు

రసాయనాల వలన ప్రత్తి నాణ్యత తగ్గుతున్నందున శాస్త్రవేత్తలు, అధికారులు ఆయా సమస్యలపై అధ్యయనం చేసి రైతులకు సకాలంలో సరైన సలహాలు అందించాలని సూచించారు. నాణ్యత , దిగుబడి తగ్గడంతో రైతులకు మంచి ధర రావడం లేదని , మరోవైపు పరిశ్రమలకు కూడా నాణ్యమైన ప్రత్తి పంట లేకపోవడం సమస్యాత్మకంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు, పరిశ్రమల దారులకు మేలు జరిగేలా సరైన చర్యలు అవసరం అని అన్నారు. కర్నూలు , నంద్యాల , పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ప్రత్తిలో ఫైబర్ క్వాలిటీ పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతులకు పలు అంశాలపై ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం లాం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.సుధారాణ, ఏ.పి టెక్స్ టైల్స్ మిల్స్ అసోసియేషన్ ఛైర్మన్ పి. కోటి రావు అవగాహన కలిగించారు.

మృతి చెందినహెడ్‌కానిస్టేబుల్ భార్యకు మేరీ సుజాతకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి

చెక్కు అందజేత

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న జి.అనిల్‌కుమార్ కుటుంబానికి తోటి హెడ్ కానిస్టేబుళ్ల ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యా లయంలో మృతుడు అనిల్ భార్య మేరీ సుజాత కు హెడ్ కానిస్టేబుళ్ళ సహకారంతో రూ.2.28 లక్షలు,పోలీస్ అసో సియేషన్ ఫండ్ ద్వారా రూ.1 లక్ష చెక్కులను అంద జేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల గుం టూరు పరేడ్ గ్రౌండ్ జరుగుతున్న ఎస్సై అభ్యర్థుల దేహ దారుఢ్య పరీక్షల బందోబస్తు విధులకు హాజరైన అనంతరం అనిల్ తిరిగి తన సొంత గ్రామం ఫిరంగిపురం వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు చెప్పారు.

అనవసరంగా అలారం చైన్ లాగొద్దు

రైల్వే సి.ఐ జి.తిరుపతిరావు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

అనవసరంగా అలారం చైన్ లాగడం, రైళ్లపై రాళ్లు రువ్వడం, రైల్వే ఆస్తులు ధ్వంసం చేయడం చట్ట ప్రకారం నేరమని రైల్వే సిఐ జి.తిరుపతిరావు అన్నారు. స్థానిక రైల్వే పోలీసు స్టేషన్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సి ఐ జి.తిరుపతిరావు మాట్లాడుతూ నరసరావుపేట ఆర్.పి.ఎఫ్ సర్కిల్ పరిధి నుదురుపాడు - కంభం రైల్వే స్టేషన్ల పరిధిలో అనవసరంగా రైలు అలారం చైన్ లాగడం, రైళ్లపై రాళ్లు రువ్వడం వంటి పనులు చేయడం వలన జరిగే పరిణామాలపై మాట్లా డారు. గడచిన 9 నెలల కాలంలో 35 చైన్లు లాగిన కేసులు, రైలులో, స్టేషన్ పరిసర ప్రాంతాలలో ధూమ, మద్యపానం 468 కేసులు నమోదైనట్లు చెప్పారు.సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల పశువులను రైలు పట్టాలపై వదలడం వలన జరిగిన సం ఘటనపై 10 కేసులు నమో దైనట్లు చెప్పారు. రైలు ప్రమాదాల నివారణకు ప్రజ లు, ప్రయాణికులు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. ఎఎస్ఐ సుభాని, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులతో రాయల శ్రీనివాసరావు తదితరులు

కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అండర్ 19 స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని చాటారని కళాశాల ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈనెల 6న చేబ్రోలు జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు పురుషుల విభాగంలో బి. గోపి, జి. మోహన్ అదేవిధంగా మహిళా విభాగంలో షేక్ షాజహాన్ బి, కె రేఖలు ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పా టు చేసిన అభినందన సభలో ఎంపికైన విద్యార్థులను వాగ్దేవి కళాశాలల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్ కె.రామకోటేశ్వరరావు, కె. రాజేంద్రప్రసాద్, పి.కృష్ణారావు, పివి అచ్యుతరావు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రాయల ఆంజనేయులు అభినందించారు

ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపల్ రాణి జయకుమార్

జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఇంటెల్ హై స్కూల్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - మేడికొండూరు

విద్యార్థులు విద్యతో పాటు, క్రీడల్లో కూడా దిశగా రాణించాలని ఇంటెల్ హై స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయకుమార్ అన్నారు. మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హై స్కూల్ క్రీడాకారులు అండర్-14 విభాగంలో జిల్లా, రాష్ట్రస్థాయి జట్టులకు ఎంపికయ్యారు. అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందిస్తూ శనివారం అభినందన సభ నిర్వహించారు. జయకుమార్ మాట్లాడుతూ ఆట ఏదైనా కష్టంతో కాకుండా ఇష్టంతో ఆడితే ప్రతి ఒక్కరికి లక్ష్యాలు దరి చేరతాయని అన్నారు. శనివారం చిలకలూరిపేట ఏఎంజీ క్రీడా మైదానంలో జరిగిన జిల్లా స్థాయి జట్టు ఎంపికలలో స్కూల్ గేమ్స్ బాక్సింగ్ అండర్-14 విభాగంలో రోహిత్, బాస్కెట్‌బాల్ అండర్- 14 విభాగంలో షేక్. సోహెల్ లు జిల్లా జట్టు లో స్థానం సాధించినట్లు చెప్పారు. మంగళగిరి బాపూజీ స్కూల్లో జరిగిన గుంటూరు రగ్బీ అసోసియేషన్ అధ్వర్యంలో అండర్ -14 జిల్లా స్థాయి పోటీలలో మొదటి స్థానంలో తమ విద్యార్థులు నిలిచారని అన్నారు. ఇంటెల్ హైస్కూలు పిఇటి షేక్ రన్ను హుస్సేన్ మాట్లాడుతూ త్వరలో గుంటూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు బాలుర విభాగంతో టి.ఆనంద్, శ్రీకాంత్, సంజయ్, యాస్మిన్, అజ్మల్, బాలికల విభాగంలో షేక్ హసియా సుల్తానా జిల్లా రబ్బీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ జట్టుకు కొర్రపాడు జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని కొర్రపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు అండర్ -19 విభాగంలో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జంపాల రమేష్ తెలిపారు. అండర్ -19 స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ లో పాల్గొంటారని తెలిపారు.ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7 నుంచి 9 వరకు చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో జరిగే అండర్- 19 స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంటులో పాల్గొంటారని తెలిపార. ు గత నెల 27 న గుం టూరు ఉమ్మడి జిల్లా నందిగంలో జరిగిన స్కూల్ గేమ్ సెలక్షన్స్ లో తమ పాఠశాల నుంచి బాలికల విభాగంలో ముగ్గురు, బాలుర విభాగంలో ముగ్గురు క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారని అన్నారు. రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులను పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ కరిముల్లా అభినందించారు.

రగ్బీ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్: రాష్ట్ర స్థాయి రగ్బీ సబ్-జూనియర్ చాంపియన్ షిప్ పోటీ లకు గుంటూరు జిల్లా అండర్-14 బాలబాలికల జట్ల ఎంపిక కు శనివారం పోటీలు నిర్వహించినట్లు గుంటూరు జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్, బాపూజీ విద్యాలయం కరస్పాండెంట్ వై.సుజాత తెలిపారు.ఈ కార్యక్రమాన్ని బాపూజీ విద్యాలయం చైర్మన్ వై.తులసీరామ్ ప్రారంభించారు. ఈ పోటీలకు వినుకొండ, పేరేచర్ల, అమరావతి, నిడమర్రు, నూతక్కి, తక్కెళ్లపాడు, యడ్లపాడు, ఉప్పలపాడు, చిన్నకాకాని , పచ్చల తాడిపర్రు మంగళగిరి పరిసర ప్రాంతాల నుండి 400 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు చెప్పారు. ప్రాబబుల్స్ 30 మంది బాలురను, 30 మంది బాలికలను ఎంపిక చేశామని, ఎంపికైన వారికి బాపూజీ విద్యాలయంలో కోచింగ్ క్యాంప్ నిర్వ హించనున్నట్లు చెప్పారు.

అక్రమ తవ్వకాలపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి

ఎయిమ్స్ వద్ద క్వారీయింగ్ ప్రదేశంలో టిడిపి నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

నియోజకవర్గంలో అవినీతికి తావు లేదన్న ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి ఎయిమ్స్ గేటు వద్ద జరుగుతున్న అక్రమ తవ్వకాలపై సమాధానం చెప్పాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. తవ్వకాల ప్రాంతం వద్ద నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే అండతోనే ఎయిమ్స్ వద్ద ఉన్న కొండను నెలరోజులుగా తవ్వుతున్నారని అన్నారు. దీనిపై గతంలో తమ పార్టీ పరిశీలించగా తవ్వకాలను కొన్ని రోజులు ఆపేసినా మళ్లీ మొదలుపెట్టారని అన్నారు. అక్రమ

క్వారీయింగ్‌పై అటవీశాఖాధికారులను సమాచార చట్టం ద్వారా వివరాలు అడిగినా సమాచారం లేదంటున్నారని, ఫారెస్టు భూముల్లో పేదలు ఇళ్లేసుకుంటే కూల్చే అధికారులు... వెయ్యి లారీలతో ఎర్రమట్టిని తవ్వేస్తుంటే చోద్యం చూస్తున్నారని విమర్శించారు. నిరసనలో నాయకులు అబ్దుల్ మజీద్, జి.దుర్గారావు, ఎం.రమేష్, టి.కోటయ్, వి.శ్రీనివాసరావు, కె.సురేష్, పి.సుందరయ్య, ఎన్.పురుషోత్తమ రాజు, సిహెచ్.ఏసుపాదం, టి.శంకర్ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి-తాడేపల్లి

మహిళలు అభివృద్ధి చెందితోనే సమాజం అభివృద్ధి చెందుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో జరుగుతున్న మహిళా నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్టుమెంట్స్ తాడేపల్లి (క్యాట్) అధ్యక్షులు జిఎస్ఆర్ మోహనరావు, క్రెడాయ్ అసోసియేషన్ నాయకులు సతీష్, శ్రీధర్, వరుణ్, రాష్ట్ర బాలోత్సవాల కన్వీనర్ పి.మురళీకృష్ణ, విశ్రాంత ఉద్యోగి గోపాలం సాంబశివరావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజం నుంచి ఎంతో తీసుకుంటున్న మనం కొంత సమాజం కోసం ఖర్చు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. కుట్టుశిక్షణ తీసుకుంటున్న మహిళలను అభినందించారు. రేడిమేడ్ మీద ఉన్న అపోహ వదిలించుకోవాలన్నారు. కుట్టుశిక్షణలో అద్భుతంగా తర్ఫీదు పొందితే అద్భుతమైన అవకాశాలు పొందవచ్చన్నారు. అందుకు

తమ కుటుంబాల్లో మహిళలు చేస్తున్న ప్రయత్నాలను కూడా వివరించారు. అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో భార్యభర్తలు ఇద్దరూ పని చేస్తేనే కుటుంబాలు నడిచే పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి,దుర్గి కోదండరామయ్య, చింతా వెంకటరత్నం, నాగూర్‌బి, బి.దశరాధరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెఎల్‌యులో విదేశీ విద్యా మేళా

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఆయా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు విదేశీ యూనివర్శిటీలలో ప్రత్యేక రాయితీలతో పాటు ఉపకార వేతనాలు కూడా అందిస్తున్నారని కెఎల్ అంతర్జాతీయ పౌర సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు అన్నారు. శనివారం వర్శిటీలోని సాక్ హాలులో నిర్వహించిన విదేశీ విద్యా మేళాను రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు లాంఛనంగా ప్రారంభించారు. ప్రపంచం నలు మూలల నుంచి వచ్చిన ముప్పై కి పైగా యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు. విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించాలనుకుంటున్న వందలాది మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో వచ్చి తమ సందేహాలను నివృతి చేసుకున్నారు. ఉన్నత విద్యకు వేసుకోవలసిన ప్రణాళిక, ఏ చదువుకు ఎలాంటి పరీక్షలు రాయ వలసి ఉంటుందనే అంశాలతో పాటు ఉత్తమ ర్యాంక్ ఉన్న యూనివర్సిటీ లో చేరాలంటే ఏ పరీక్ష లో ఎన్ని మార్కులు సాధించానే విషయాలను ఆయా యూనివర్సిటీల ప్రతినిధులు విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. కిషోర్‌బాబు మాట్లాడుతూ కెఎల్ యూనివర్శిటీలో చదువుతున్న విద్యార్దులు ఉన్నత చదువుల కోసం విదేశీ విశ్వవిద్యాలయాలలో చేరాలనుకునే వారికి

విదేశీ విద్యా మేళాను ప్రారంభిస్తున్న కెఎల్ యు రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు

ఫీజు రాయితీలతో పాటు ఉపకార వేతనాలను కూడా పెద్ద ఎత్తున అందిస్తున్నారని అన్నారు. అమెరికా నుండి మియామి యూనివర్శిటీ, సెయింట్ లూయిస్ యూనివర్శిటీ, హార్ట్ ఫోర్డ్ యూనివర్శిటీతో పాటు మరో ఇరవై ఐదు విశ్వవిద్యాలయాలు కెఎల్ యూనివర్శిటీ విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడానికి పోటీ పడ్డాయన్నారు. సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఆయా దేశాలకు చెందిన యూనివర్శిటీలలో చేరేందుకు ఆసక్తి చూపినట్లు చెప్పారు. కార్యక్రమంలో కెఎల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాలర్ల ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డైరెక్టర్ విజయ్ మారుతి పాల్గొన్నారు.

అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యులుగా

ఎమ్మెల్యే రోశయ్య నియామకంపై హర్షం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యులుగా పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యను ప్రభుత్వం నియ మించింది. శనివారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యేను వైసిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవి ష్యత్తులో ఎమ్మెల్యే మరెన్నో ఉన్నత పదవులు పొంది ప్రజలకు సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పొన్నూరు పట్టణ,

మండల, రుద్రపాటి ఆదిశేషు, రూరల్ జెసిఎస్ కన్వీనర్ భవనం వంశీ రెడ్డి, పట్టణ జెసిఎస్ కన్వీనర్ ఎ.సాంబ శివరావు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక సికె జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ చదువుతూ ప్రతిభ చూపిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలను కాలేజీ 1999-2001 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం బహూకరించారు. పూర్వ విద్యార్థి నరేష్ మాట్లాడుతూ విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ జె.పాండురంగారావు, ప్రిన్సిపల్ ఎ.రత్నబాబు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక చంద్రబాబునాయుడు కాలనీ మెయిన్‌రోడ్డు ఆటోస్టాండ్ వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వ హిస్తున్నట్లు నిర్మల ప్రథమ చికిత్సా కేంద్రం నిర్వాహకులు, ఆర్ ఎంపి వైద్యులు డి.కోటేశ్వరరావు తెలిపారు. గుంటూరు కొత్తపేటకు చెందిన అంజలి మల్టీ స్పెషాలిటీ వైద్యశాల వైద్య బృందం ఉదయం 8 గంటలకు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు.ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఊపిరితిత్తులు, క్రిటికల్ కేర్‌స్పెషలిస్ట్ డాక్టర్ బి.దుర్గాప్రసాద్, కార్డియాలజి స్పెషలిస్ట్ డాక్టర్ బి.నాగరాజు పాల్గొని వైద్య సేవలం దిస్తారన్నారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోటేశ్వరరావు కోరారు.

శాంతి ర్యాలీకి వెళ్తున్న టిడిపి నాయకుల అరెస్ట్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఉమ్మడి గుంటూరు జిల్లాల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గుంటూరులో తలపెట్టిన ధర్మాగ్రహ శాంతి ర్యాలీకి వెళ్తున్న టిడిపి తాడేపల్లి మండల నాయకులను శనివారం గుంటూరు ఆటోనగర్ వద్ద పోలీసులు అరెస్టు చేసి, పెదకాకాని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో తెలుగుదేశం తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు, చిర్రావూరు గ్రామ పార్టీ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు, కొలనుకొండ గ్రామ పార్టీ అధ్యక్షులు కంచర్ల రంగారావు, తప్పెట్ల రాజు, పోకల వెంకటేశ్వరరావు, కోలాంటి అశోక్, తుమ్మపూడి వినోద్ తదితరులు ఉన్నారు.

ఇస్త్రీ బండ్లు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని బోసబొమ్మ సెంటర్‌కు చెందిన మోరా జేమ్స్, క్రిష్టియణపేటకు చెందిన కె.శ్రీనివాసరావులకు శనివారం ఇస్త్రీ బండ్లను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు బి.వేణు గోపాల సోమిరెడ్డి, ఎస్.అశోక్, వికాస్, ఒ.నాగమల్లేశ్వరరావు, మండె విజయ దొర అందజేశారు.

నిర్మల కుమారికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరి పట్టణానికి చెందిన విటిజెఎం అండ్ ఐవిటిఆర్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ తలతోటి నిర్మల కుమారికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేసింది. ఆంగ్ల విభాగంలో పనిచేసిన నేపథ్యంలో ఆ సాహిత్యానికి సంబంధిం చిన ఆంగ్ల సాహిత్యానికి సంబంధించి అమితవ్ ఘోష్ నవలల పై పరిశోధన చేసినందుకు వర్సిటీ ఇంగ్లిష్ డిపార్ట్మెంట్ నిర్మల కుమారి కి పిహెచ్‌డిని శనివారం అందజేసింది. "అమితావ్ ఘోష్ నవలల్లో భారతదేశ స్వతంత్రం అనంతర పరిణామాల ప్రభావం మరియు దక్పథం అంశంపై పరిశోధనా పత్రాలను నిర్మల కుమారి సమర్పించారు. ఆంగ్ల విభాగం అధిపతి ప్రొఫెసర్ కే. రత్న షీలా మణి గైడ్‌గా వ్యవహరించారు. పలువురు నిర్మల కుమారికి అభినందనలు తెలిపారు.

ఇండియన్ ఆర్ట్స్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి -గుంటూరు సిటి

నాజ్ సెంటర్లో గుంట గ్రౌండ్ లో ఇటీవల ఏర్పాటు చేసిన ఇండియన్ ఆర్ట్స్, క్రాఫ్ట్ షాపింగ్ ఫెస్టివల్ 2023 కు నగర వాసుల నుండి విశేష స్పందన లభిస్తుందని నిర్వాహకులు జునాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. 50 వేలకు పైగా వెరైటీలు ఒకే ప్రదేశంలో ఉంచడంతో వాటిని కొనేందుకు నగం వాసులు మక్కువ చూపుతున్నారన్నారు. ఇమిటేషన్ జ్యువెల్లరీ, రాజస్థానీ చెప్పులు, విభిన్న రకాల పత్రంజిలు బనారస్ చీరలు, బాందినీ చీరలు, పెయింటింగ్స్, లక్నో ఎంబ్రాయిడరీ, కుర్తాలు, కార్పెట్లు, ముత్యాలు, వెస్ బెంగాల్ కంతా చీరలు, బెడ్ షీట్స్, కాశ్మీరీ డ్రెస్ మెటరియల్ బాగల్పూరి సిల్క్ అండ్ డ్రెస్ మెటీరియల్, రాజస్థానీ గాజులు, టెర్రాకోట ఉడెన్ ఫర్నిచర్ , చెక్క బొమ్మలు రోజ్వుడ్ వస్తువులు, కలంకారి చిత్రాలు, కొండపల్లి ఏటికొప్పాక బొమ్మలు ఇత్తడి రాగి కళాత్మకమైన మెటల్ కాస్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. ఈ స్టాల్ ఉదయం 10 గంటల నుండి రాత్రి 9 వరకు గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. 29వ తేదీ వరకు కొనసాగుతుందని, ఉచిత ప్రవేశం తో పాటు డెబిట్ కార్డ్ క్రెడిట్ కార్డ్ ద్వారా కొనుగోలు చేసిన వినియోగదారులకు 10 శాతం డిస్కౌంట్లు అందిస్తున్నామన్నారు.

నివాళులర్పిస్తున్న కలెక్టర్, జెసి, తదితరులు

పేదల సంక్షేమానికి శంకరన్ విశేష కృషి

ప్రజాశక్తి-గుంటూరు

అణగారిన వర్గాలు , పీడిత ప్రజల ఆశాజ్యోతిగా, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అభివద్దే ధ్యేయంగా తన పదవీ కాలంలో అకుంఠిత దీక్షతో ఐఎఎస్ అధికారిగా వివిధ హోదాల్లో విధులు నిర్వహించిన ఎస్.ఆర్.శంకరన్ మహానుభావుడని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో ఎస్.ఆర్.శంకరన్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఆర్.శంకరన్ మన రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా, త్రిపుర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పలు హోదాల్లో పని చేసి పదవులకే వన్నె తెచ్చారన్నారు. వెట్టిచాకిరి నిర్మూలించడంలోనూ, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అభివద్దే ధ్యేయంగా ఆయన పని చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ఐటీడీఏల ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించారని, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం మార్గదర్శకాలు, నిబంధనలు రూపొందించడంలో విశేష కషి చేశారని శ్లాఘించారు. వారి సేవలకు గుర్తింపుగా కలక్టరేట్‌లో నిర్మించిన సమావేశ మందిరానికి ఎస్.ఆర్.శంకరన్ ఐఎఎస్ సమావేశ మందిరంగా నామకరణం చేసుకున్నట్లు తెలిపారు. పరిపాలనలో అత్యున్నత హోదా కలిగినప్పటికీ సాదాసీదాగా నిరాడంబరమైన జీవితం గడిపిన శంకరన్ అందరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె.చంద్రశేఖర్‌రావు, డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, సిపిఓ శేషశ్రీ, జెడ్పీ సిఈఓ జె.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిరసనలపై పోలీసుల నిర్బంధం

ఉమ్మడి జిల్లాలో ప్రజా ఉద్యమాలపై పోలీసుల నిర్బంధం కొనసాగుతోంది.నెలల తరబడి సెక్షన్ 30 అమలు చేస్తున్నారు. అడపాదడపా 144 సెక్షను అమలు చేస్తున్నారు. ర్యాలీలు, సభలపై నిషేధం విధిస్తున్నారు. నిషేదాజ్ఞలను ఉల్లఘించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని ఆశా కార్యకర్త రేపూడి కృపమ్మ శుక్రవారం విధులు నిర్వహిస్తూ పని ఒత్తిడి వల్ల మరణించింది. ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని ఆశావర్కర్ల యూనియన్, సిఐటియు నాయకులు ఆందోళనకు పూనుకోగా పోలీసులు వీరిపై నిర్బంధం అమలు చేశారు. తాడేపల్లి పోలీసులు బలవంతంగా ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీతో పాటు పలువురిని అరెస్టు చేసి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ నిర్బంధానికి వ్యతిరేకంగా ఆశ కార్యకర్తలు ఆందోళను ఉధృతం చేయడంతో ఆశావర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధనలక్ష్మీతోపాటు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, తాడేపల్లి సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు పాటు మరో నలుగురు ఆశ కార్యర్తలను అరెస్టు చేసి దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ఆశ వర్కర్లు విధులు బహిష్కరించి నల్లరిబ్బన్లు ధరించి నిరసనలకు దిగారు. మరో వైపు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, ప్రతి పక్ష నాయకులపై కేసుల నమోదు వంటి చర్యలపై జిల్లా వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా నిరసనలు పెరుగుతున్నాయి. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు తరువాత గత నెల రోజులుగా ఆ పార్టీ కార్యకర్తలు దీక్షలు,ధర్నాలు, వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. టిడిపి నేతల నిరసనలపై పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారు. గత కొంతకాలంగా టిడిపి నేతల్లో తెగువ పెరిగింది. వచ్చే ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామన్న ధీమాతో పోలీసుల ఆంక్షలను లెక్కచేయడం లేదు. పోలీసులు కేసులు నమోదు చేసినా టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క జీవోతో అవన్ని పోతాయని టిడిపి నాయకులు కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నాయకులకు భరోసా ఇస్తున్నారు. దీంతో పోలీసుఆంక్షలను లెక్కచేయడం లేదు. వైసిపి నాయకులు, కార్యకర్తలు నిర్వహించే సొంత కార్యక్రమాలకు ఎటువంటి ఆంక్షలు, నిషేదాజ్ఞలు అమలు చేయలేని పోలీసు యంత్రాంగం ప్రతిపక్షపార్టీలపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. పొన్నూరులో బ్యాంకు అధికారులు, కొంతమంది దళారీల వల్ల మోసపోవడంతో గుండెపోటుకు గురైన మరియమ్మ బంధువులు ఆందోళన నిర్వహించగా పోలీసులు వారిపై లాఠీఛార్జి చేశారు. మరియమ్మ అనే మహిళకు గృహ నిర్మాణం నిమిత్తం రూ.3 లక్షలు రుణం ఇచ్చి రూ.18 లక్షలు రుణం ఇచ్చినట్లు రికార్డులు సృష్టించి రూ.15లక్షలు కాజేసిన వారిపై ఎటువంటిచర్యలు లేవు. రూ.3 లక్షల రుణానికి రూ.22 లక్షలు బకాయిలు చెల్లించాలని నోటీసులు ఇవ్వడంతో ఒక నిండుప్రాణం బలవ్వగా బాధితులపై పోలీసులు దాడికి పాల్పడటం పేద ప్రజలపట్ల ప్రభుత్వ యంత్రాంగానికి ఉన్న ఉదాశీనతకు నిదర్శనంగా నిలుస్తోంది.

(ఎ.వి.డి.శర్మ)

పెన్షన్ల కోసం ఎదురు చూపులు తప్పట్లేదు

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు ఏడో తేదీ వచ్చినా పెన్షన్ కోసం ఎదురు చూపులు తప్పట్లేదని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వెంకటేశ్వర్లు, జి.ప్రభుదాసు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సకాలంలో పెన్షన్ డబ్బులు జమ కాకపోవటంతో వృద్ధాప్యంలో వైద్య ఖర్చులకు, మందులకు పెన్షనర్లు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే పెన్షన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా 1వ తేదీన పెన్షన్ చెల్లించాలని, గతంలో సూపర్ సీనియర్లకు ఇచ్చే అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ 5శాతం తగ్గించారి, దానిపై డిఆర్ కూడా కొంత మందికి తగ్గించారన్నారు. దీనిపై సిఎఫ్ఎంఎస్‌కు వినతిపత్రం ఇవ్వగా తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ మాత్రమే కలిపారని, డిఆర్ కలపలేదన్నారు. జిఒ 67 ప్రకారం డిఆర్ ఎరియర్లు మొదటి వాయిదాను సెప్టెంబర్‌లో చేస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదన్నారు. ఎక్కువ మంది పెన్షనర్లకు పాత పద్దతిలో ఇన్‌కంట్యాక్స్ కట్ చేశారని, రావాల్సిన డిఆర్ ఎరియర్లు రాకపోగా ఇన్‌కంట్యాక్స్ మాత్రం కట్ చేశారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పెన్షన్లు తక్షణమే విడుదల చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు తక్షణమే పెన్షన్ విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు ఒక ప్రకటనలో కోరారు.7వ తేదీ వచ్చినా పెన్షన్ జమ కాకపోవటంతో పెన్షనర్లు ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మందులకు డబ్బుల్లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. సంఘం తరపున ట్రెజరీ అధికారుల్ని సంప్రదించగా, ఇంకా రెండు, మూడు రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని తెలిపారన్నారు. పెన్షనర్ల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తక్షణమే పెన్షన్లు విడుదల చేయాలని కోరారు.

ఆరోగ్య సురక్షలో 37 వేల మంది నమోదు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం వైద్య శిబిరాలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి కి వివరించారు. శనివారం డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లాల వారీగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గుంటూరు కలెక్టరేట్ నుండి సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు గురించి వివరిస్తూ ప్రజలు తమ ఆరోగ్య సమస్యలపై భారీ ఎత్తున జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 37,413 మంది ఓపిలో నమోదు అయ్యారన్నారు. సర్వర్ నెమ్మదిగా పనిచేయడం వల్ల 25,773 మంది వివరాలను మాత్రమే ఆన్లైన్‌లో నమోదైనట్లు తెలిపారు. సర్వర్ వేగంగా పని చేసినట్లైతే మిగిలిన 12 వేల మంది వివరాలను కూడా నమోదు చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలక్టరేట్ వీసీ హాల్ నుండి సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి, డియం అండ్ హెచ్ డా. శ్రావణ బాబు, జెడ్పీ సిఈఓ జె.మోహన్ రావు, పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సిపిఓ శేషశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఆదర్శ గ్రామాల యోజన పథకంపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

పార్లమెంట్ (చట్ట సభల) ఆదర్శ గ్రామయోజన కార్యక్రమం క్రింద రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి గ్రామాభివద్ధికి జిల్లాలో దత్తత తీసుకున్న వేమవరం, మెరికపూడి, పెదకాకాని గ్రామాలలో 35 ఇండికేటర్లు సాధించే విధంగా విలేజ్ డెవలప్మెంట్ ప్లాన్‌లో కలుపుకొని ఆ మేరకు అధికారులు సమన్వయంతో అభివద్ధి చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం కలక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పార్లమెంట్ (చట్ట సభల) ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమం పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం అనే భావనతో పార్లమెంట్ ఆదర్శ గ్రామ యోజన అనే పథకాన్ని పార్లమెంట్ సభ్యులు ప్రతి ఏడాది ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అక్కడి గ్రామ ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం అనేది ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందుకుగాను రూపొందించుకున్న విలేజ్ డెవలప్మెంట్ ప్లాన్‌లో 35 ఇండికేటర్లను సాధించే విధంగా రూపకల్పన చేసుకొని సంబంధిత అధికారులు ఆ మేరకు లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జెడ్పీ సిఇఒ జె.మోహన్‌రావు మాట్లాడుతూ పెదకాకాని గ్రామానికి ఇండికేటర్ల లక్ష్య సాధనలో రాష్ట్రంలో మూడవ ర్యాంక్ వచ్చిందని జిల్లా కలెక్టర్ కు తెలిపారు. సమావేశంలో పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, సిపిఓ శేషశ్రీ , స్టెప్ సిఈఓ పల్లవి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.